

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 39.0
కనిష్ఠం : 23.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:26 (సోమ)
సహరి : 4:37 (మంగళ)

జిల్లావ్యాప్తంగా విస్తృత తనిఖీలు : ఎస్పీ

ఏలూరు క్రైం, మార్చి 31 : సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అన్నారు. గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 6,200 రూపాయల విలువైన 13.97 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు స్వాధీనం చేసుకున్న నగదు 3 లక్షల 61 వేల రూపాయలు అని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అంతర్‌రాష్ట్ర, అంతర్ జిల్లాల్లో ఎనిమిది చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామన్నారు. 31 ఫ్లయింగ్ సర్వైలెన్స్ టీమ్‌లు ఆకస్మికంగా వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నాయన్నారు. కేంద్ర సాయుధ బలగాలతో సమస్యాత్మక, అతిసమస్యాత్మక గ్రామాలల్లో కవాత్ నిర్వహిస్తున్నామన్నారు. ఓటర్లను ఎవరైనా ప్రలోభ పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని, ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరు నడుచుకోవాలని సూచించారు.

368 అభ్యర్థనలకు అనుమతులు : కలెక్టర్

ఏలూరు సిటీ, మార్చి 31: జిల్లాలో ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ/ ఎన్‌కోర్ ద్వారా అందిన అభ్యర్థనలలో ఇంతవరకు 368 అనుమతులు ఇచ్చినట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్నవెంకటేష్ తెలిపారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే ఏలూరు కలెక్టరేట్‌లో జిల్లా ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రం ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. వేర్వేరు ఫిర్యాదు వేదికల ద్వారా అందిన ఫిర్యాదుపై జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకొంటున్నామన్నారు. ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ ద్వారా 601 అభ్యర్థనలు రాగా వాటిలో ఇంతవరకు 368 అనుమతులు జారీ చేయగా మరో 30 పరిశీలనలో ఉన్నాయన్నారు. సరైన రీతిలో దరఖాస్తు చేయని 203 తిరస్కరించబడ్డా యన్నారు. సి-విజిల్ ద్వారా 181 ఫిర్యాదులు రాగా వాటిలో 95 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. మరో 86 ఎన్నికలకు సంబంధం లేని ఫిర్యాదులు తిరస్కరించబడ్డాయ న్నారు. మీడియాలో ఎన్నికల ఉల్లంఘనలకు వచ్చిన 68 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా మొత్తంగా రూ.81.76 లక్షలు విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులు సీజ్ చేశామన్నారు. నిరంతర నిఘాలో భాగంగా రాష్ట్ర సరిహద్దుల వద్ద 10 ఎస్ఎస్‌టీ, జిల్లాలో మిగిలిన ప్రాంతాల్లో 28 ఎస్ఎస్‌టీ, 24 వీడియో సర్వేలెన్స్ బృందాలు పనిచేస్తున్నాయన్నారు. ఈ బృందాల పనితీరును పరిశీలించేందుకు సంబంధిత వాహనాలకు జీపీఎస్ విధానం ఏర్పాటు చేశారని, వీటి కదలికలను కలెక్టరేట్‌లోని కంట్రోల్‌రూమ్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు.

'ఓపెన్' ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 62 మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 31 : ఏపీ ఓపెన్ స్కూల్స్ దూరవిద్య ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో భాగంగా ఆదివారం జరిగిన భౌతికశాస్త్రం పరీక్షకు జిల్లాలో 142 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 128 మంది, రసాయనశాస్త్రం పరీక్షకు 140 మందికి 102 మంది, జీవశాస్త్రం పరీక్షకు 40 మందికి 30 మంది హాజరయ్యారని డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

ఏలూరులో..



దెందులూరులో..



పెదనిండ్రకొలనులో..



జిల్లాలోని చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసు చూపిన మార్గంలో ప్రతిఒక్కరూ పయనించాలని, పాస్టర్లు సందేశ మిచ్చారు. ఏలూరు పెనియల్ చర్చిలో ఏలూరు లోక్‌సభ స్థానం కూటమి అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, ఏలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బడేటి చంటి, దెందులూరు ఆర్‌సీఎం చర్చి శుద్ధీకరణ మాత దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌రావు, పెదనింద్రకొలను ఆర్‌సీఎం చర్చిలో ఉంగుటూరు కూటమి ఉమ్మడి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు ఈస్టర్ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఉమ్మడిగా..



కలసికట్టుగా కూటమి పార్టీలు

- వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టే ప్రయత్నాలు
- గీత దాటుతున్న వారిపై కమిషన్‌కు ఫిర్యాదులు
- ఉరూరా ప్రచారంలో అందరికంటే ముందడుగు
- స్థానిక నాయకత్వానికి ఊతమిచ్చే వ్యూహం
- నియోజకవర్గాల వారీగా ఆత్మీయ సమావేశాలు
- తొలి పర్వంలోనే దీటైన నడక

ఎంపీ స్థానం నుంచి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థుల వరకు ఉమ్మడిగా రంగంలోకి దిగారు. అధికార వైసీపీని నేరుగా ఢీ కొట్టేందుకు ఒకేలా ముందుకు సాగుతున్నారు. పోలింగ్‌కి పట్టుమని ఇంకా 40 రోజులే మిగిలి ఉండగా, పట్టుదల, సరికొత్త ప్రణాళికలతో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు ఆయా నియోజక వర్గాల్లో దూకుడుగా వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. అధికార వైసీపీ ఎత్తుగడలను తిప్పికొడుతూనే ఇంకోవైపు అందరిని కూడకట్టుకుని ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్‌తో పాటు వివిధ పథకాలను వివరిస్తూ తమ గెలుపు అభివృద్ధికి మలుపు అని వారిని మెప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

ఇప్పటికే ఏలూరు, నరసాపురం లోక్‌సభ స్థానాల బరిలో ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించారు. దీనికి అనుగుణంగానే ఎక్కడా పొరపొచ్చాలు తలెత్తకుండా నియోజకవర్గాల వారికి మూడు పార్టీలు ముఖ్య నేతలతో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నారు. ఆయా నియోజక వర్గాల్లో తాజాగా నెలకొన్న స్థితిగతులను వీటిని అధిగమించేందుకు, తమకు అనుకూలంగా మలుచుకునేందుకు వీలుగా ప్రత్యేక కార్యాచరణకు దిగారు. ఏలూరు ఎంపీస్థానం నుంచి పుట్టా మహేష్ యాదవ్, నరసాపురం లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ పక్షాన ఉమ్మడి అభ్యర్థి శ్రీనివాసవర్మ ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉన్న ఉమ్మడి అభ్యర్థులతో పరస్పర సహకారం ఈ కొద్దిసమయంలోనే పెంచుకున్నారు. నిరంతరం సమన్వయం, సహకారం కోసం ప్రత్యేక కమిటీలు వేశారు. ప్రచారపర్వం దగ్గర నుంచి గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో ముఖ్యనేతల భేటీల్లోనూ ఇప్పటికే నిరంతరం సమీక్షలు, సంప్రదింపులు కొనసాగుతూనే ఉన్నాయి. ఏలూరు లోక్‌సభ స్థానం బరిలో తెలుగుదేశం పక్షాన ఉమ్మడి అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్ తాజాగా అన్ని అసెంబ్లీ స్థానాల నుంచి పోటీచేస్తున్న అభ్యర్థులతో నేరుగా ముఖాముఖి భేటీ అయ్యారు. బీజేపీ, జనసేన నేతలతో పరస్పరం సంప్రదింపులకు దిగుతున్నారు. ఎక్కడా మాట జవదాటకుండా జాగ్రత్త పడుతున్నారు. ఆ పార్టీ నేతలతో మాట్లాడడం, వారి మద్దతుతో ఆయా నియోజకవర్గాల్లో దూకుడుగా వెళుతున్నారు. ఇప్పటికే కైకలూరు, ఏలూరు, ఉంగుటూరు నియోజక వర్గాల్లో ఆత్మీయ సమావేశాల్లోనూ పాలుపంచుకున్నారు. మరోవైపు ఏలూరు అసెంబ్లీ స్థానం నుంచి బడేటి చంటి, ఇప్పటికే ఇతర పార్టీల నుంచి భారీగా టీడీపీలో చేరేందుకు వస్తున్న వారిని ఆకట్టుకుంటున్నారు. ఏలూరు నగరంలో పైచేయి సాధించిన పక్కా ప్రణాళికతో ఉన్నారు. మరోవైపు జనసేన కన్వీనర్ రెడ్డి అప్పలనాయుడు బీజేపీ పక్షనేతలతోనూ పరస్పర సమన్వయానికి చేరువ అయ్యారు. దీంతో అధికార వైసీపీకి గట్టిపోటీ ఇస్తున్నారు. దెందులూరు నియోజకవర్గం నుంచి చింతమనేని ప్రభాకర్, తనకు ఉన్న ఇమేజ్‌తో పార్టీశ్రేణుల సహకారంతో నియోజకవర్గమంతా కలియతిరుగుతున్నారు. ఎక్కడికక్కడ పార్టీలో వచ్చి చేరుతున్న నేతలను, కార్యకర్తలను, కేడర్‌ను నేరుగా ఆహ్వానిస్తున్నారు. పెదవేగి, దెందులూరు, పెదపాడు మండలాల్లో తనకు ఇంతకు ముందే ఉన్న పట్టును మరింత బలోపేతం చేసుకునే దిశగా ఎక్కడ అవసరమైతే అక్కడ వాలిపోతున్నారు. వైసీపీ ఇప్పటికే రకరకాల ఎత్తుగడలతో నియోజక వర్గంలో ప్రయత్నిస్తుండగా వాటిని తిప్పికొట్టడంలో ప్రభాకర్ ఇప్పటికే సక్సెస్ అయ్యారు. చింతలపూడి నియోజకవర్గంలోనూ ఉమ్మడి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ పట్టుబిగించారు. అందర్నీ కలుపుకుని వెళుతూ మండలస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు పార్టీలో ఉత్తేజం పెంచే ప్రయత్నం చేస్తున్నారు. అధికార వైసీపీ మాత్రం స్థానికుల లుకలుకలతో సతమతమవుతోంది. ఉంగుటూరు నియోజకవర్గంలో జనసేన, ఉమ్మడి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు ఇప్పటికే నియోజకవర్గం అంతటా సుడిగాలి పర్యటన చేశారు. వీలైన గ్రామాల్లో పాదయాత్ర చేస్తున్నారు. ఈ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు బీజేపీ పక్షాన మాలతిరాణి ధర్మరాజుకు సహకారం అందిస్తుండగా వీరికి ఎంపీ అభ్యర్థి మహేష్‌కుమార్ కూడా తోడయ్యారు. పోలవరంలో జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజును ఒడ్డు ఎక్కించేందుకు టీడీపీ పక్షాన బొరగం శ్రీనివాస్‌తో పాటు మరికొందరు నిరంతరం శ్రమిస్తున్నారు.

అంతా కలిసికట్టుగా..

రాష్ట్రనాయకత్వం ఆదేశించినట్టుగానే గీత దాటకుండా ఉమ్మడిగా కలిసికట్టుగా ప్రయాణించడం ద్వారా ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ అభ్యర్థులు సరికొత్త ట్రెండ్ సృష్టిస్తున్నారు. వైసీపీ నుంచి అప్పుడప్పుడు ఎదురవుతున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడుతున్నారు. ఇప్పటికే ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటించకుండా గీతదాటే వారి పై ఇలా ఫిర్యాదు చేయడం ద్వారా కొంతలోకొంత కట్టడి చేయడంలో సక్సెస్ అయ్యారు.



ఏలూరులో జరిగిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు



ఐక్యత చాటుతున్న కూటమి ఏలూరు ఎంపీ అభ్యర్థి మహేష్‌కుమార్ యాదవ్, జనసేన, టీడీపీ నాయకులు

మీవాడిని... మీలో ఒకడిని

కూటమి ఏలూరు ఎంపీ అభ్యర్థి మహేష్‌కుమార్ యాదవ్

ఏలూరు, మార్చి 31 : 'ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో బ్రహ్మాండమైన అభివృద్ధి చేసి చూపిస్తాం. ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తాం. మహిళలకు ప్రాధాన్యత ఇస్తాం, అన్నివర్గాలకు తోడుగా, అండగా నిలుస్తాం. మీలో ఒకడ్ని... మీవాడిని గెలిపించండి'.. అంటూ ఏలూరు లోక్‌సభ స్థానం కూటమి అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఏలూరులో ఆదివారం తన కార్యాలయంలో అసెంబ్లీ నియోజక వర్గాల అభ్యర్థుల సమక్షంలో మహేష్ యాదవ్ మీడియాతో మాట్లాడారు. తెలుగుదేశం హయాంలో చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించడమే కాకుండా విస్తరించారని ఇప్పటికే 70 శాతం మేర పనులు జరిగాయని, అయితే వైసీపీ ప్రభుత్వంలో ఆ పనులు అన్నింటిని ఆపివేసి మెట్ట ప్రాంతానికి నీరు అందకుండా చేశారని దుయ్య బట్టారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలంటే తెలుగుదేశం గెలిచి తీరాలని ఆకాంక్షించారు. కొల్లేరు సమస్యలను అధిగమించేందుకు అక్కడివారిని ఆదుకునేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. వాస్తవానికి తాను మాజీ ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు అల్లుడినే కాదు... గోదావరి జిల్లాల అల్లుడిని కూడానని అంటూనే తనను ఆదరించి అక్కున చేర్చుకుని గెలిపించాల్సిందిగా అభ్యర్థించారు. ఈ ప్రాంత సమస్యలు అన్నింటిపైన పూర్తి అవగాహనతో పరిష్కార మార్గాలను ప్రత్యేకంగా నివేదిక రూపంలో రప్పించుకుని ఆ మేరకు పరిష్కారమయ్యేలా కష్టించి పనిచేస్తానని భరోసా ఇచ్చారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో అభ్యర్థులుగా పోటీచేస్తున్న చింతమనేని ప్రభాకర్, బడేటి చంటి, కొలుసు పార్థసారథి, సొంగా రోషన్‌కుమార్, చిర్రి బాలరాజు, పత్సమట్ల ధర్మరాజు, డాక్టర్ కామినేని శ్రీనివాసులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఉన్నత విద్యావంతుడే కాకుండా సమస్యల పట్ల అవగాహన కలిగిన మహేష్ కుమార్ యాదవ్, లోక్‌సభ అభ్యర్థిగా తగిన అర్హుడని, బలహీనవర్గాల నుంచి వచ్చిన ఆయనను అందరూ ఆశీర్వదించి గెలిపించాల్సిందిగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, దెందులూరు టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. నియోజక వర్గాల నుంచి వచ్చిన ముఖ్యులతోనూ మహేష్‌యాదవ్ ముఖాముఖి భేటీ అయ్యారు. ప్రచారంలో తగు ప్రణాళికలతో రాబోయే 45 రోజుల్లోనూ ముందుకు సాగేలా అందరితో చర్చించారు. పెద్దఎత్తున సీనియర్లు, కార్యకర్తలు, నేతలు తరలివచ్చారు. విలేకరుల సమావేశంలో జనసేన జిల్లా అధ్యక్షుడు చినబాబు, జనసేన మహిళా నేత ఘంటసాల లక్ష్మి, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, తెలుగుదేశం అధికార ప్రతినిధి శ్యామ్ సుందరశేషు, మండవా లక్ష్మణరావు, పోలవరం కన్వీనర్ బొరగం శ్రీనివాస్ పాల్గొన్నారు.

■ ఆంధ్రజ్యోతితో ఆఫీసర్

కట్టుదిట్టంగా ఏర్పాట్లు..

కైకలూరు ఆర్‌వో కె.భాస్కర్



- కైకలూరు నియోజక వర్గంలో నాలుగు మండలాల పరిధిలో 63 సమ స్యాత్మక గ్రామాలు న్నాయి. ఆయా గ్రామాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి సీసీ కెమెరాలను, అదనపు పోలీసు బల గాలను ఉపయోగించి ప్రశాంతమైన వాతా వరణంలో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు ను వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నాం.
- నామినేషన్ ప్రక్రియలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు నామినేషన్ వేసుకోవాలంటే రూ.5వేలు చెల్లించాలి. గతంలోనిది కాని లేదా సీఎం జగన్ ఫొటోలు లేని కుల ధ్రువీకరణ పత్రాలను నామినేషన్లో దాఖలు చేయాలి. కొత్తగా కావాల్సిన కుల ధ్రువీకరణ పత్రాలను అందిస్తాం.
- నియోజకవర్గంలో 18,166 మంది ఓటర్లకు కొత్తగా గుర్తింపుకార్డులు అందజేస్తున్నాం. వాటిని పోస్టు ద్వారా ఆయా ఓటర్లకు అందేలా చర్యలు తీసుకున్నాం. ఓటరు గుర్తింపు కార్డు లేని వారు 12రకాల ప్రభుత్వ గుర్తింపు పొందిన కార్డులను వినియోగించుకోవచ్చు. దివ్యాంగులు, 80 ఏళ్ల పైబడిన వృద్ధులు ఇంటి వద్దే ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది.
- నియోజకవర్గంలో గతంలో 234 పోలింగ్ బూత్‌లు ఉండగా ఈ సార్వత్రిక ఎన్నిక లకు కైకలూరు మండలం కొట్టాడ గ్రామశివారు రాజులకొట్టాడలో కొత్తగా పోలింగ్‌బూత్ ఏర్పాటుచేశారు. ఆలపాడు శివారు ఉప్పుటేరు వద్ద, పెదపాలపర్రులో ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేశాం.

- కైకలూరు

సచివాలయాల్లోనే పింఛన్!

- ఈసీ ఆదేశాల మేరకు 3 నుంచి 8వ తేదీ వరకు పంపిణీకి ఏర్పాట్లు
- జిల్లా వ్యాప్తంగా 2.74 లక్షల పింఛన్‌దారులు

ఏలూరు సిటీ, మార్చి 31 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉంది. ఇప్పటి వరకు సామాజిక పింఛన్‌లను గ్రామ/వార్డు వలంటీర్లు ఇంటింటికీ పింఛన్‌లు పంపిణీ చేసేవారు. అయితే వలంటీర్లతో సామాజిక పింఛన్లు పంపిణీ చేయించొద్దని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఎన్నికల విధుల నుంచి వలంటీర్లను దూరంగా ఉంచాలని మరోసారి స్పష్టం చేసింది. వలంటీర్లు ద్వారా ఎటువంటి పథకాలు, పింఛన్‌లు, నగదు పంపిణీ చేయకూడదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఎన్నికల కోడ్ ముగిసే వరకు వలంటీర్లకు ఇచ్చిన ట్యాబ్, మొబైల్‌తో పాటు ఇతర ఉపకరణాలు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ల వద్ద డిపాజిట్ చేయాలని ఈసీ ఆదేశించడం, ప్రస్తుతం ప్రభుత్వం కొనసాగిస్తున్న పథకాలను, నగదు పంపిణీ పథకాలను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రత్యేకించి ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా అమలు చేయాలని ఈసీ సూచించడంతో ఇప్పుడు ఇంటింటికీ పింఛన్లు పంపిణీ లేనట్లేనని చెబుతున్నారు.

సచివాలయాల్లోనే పంపిణీ

ఏలూరు జిల్లాలో మొత్తం సామాజిక పింఛన్‌లు 2లక్షల 74వేలు ఉన్నాయి. వీటికి సంబంధించి జిల్లా మొత్తం మీద లబ్ధిదారులకు రూ.81 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈనెల 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకు జిల్లాలో పింఛన్‌లు పంపిణీ జరుగుతుందని డీఆర్‌డీఏ అధికారులు చెబుతున్నారు. ఈ సారి ఎన్నికల కోడ్ అమలులో ఉండటం, ఈసీ ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేయడంతో ఈ సారి సామాజిక పింఛన్‌లు గ్రామ/వార్డు సచివాలయాల్లోనే పంపిణీ చేస్తారని చెబుతున్నారు. సచివాలయ సిబ్బంది ఈ పింఛన్ మొత్తాలను లబ్ధిదారులకు సచివాలయాల వద్దే అందజేయనున్నారు.



మార్గదర్శకాలు జారీ

పింఛన్లు పంపిణీపై రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ ప్రకారం పరిశీలిస్తే గ్రామ/ వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్‌లు పంపిణీ చేయాలి. గ్రామీణ స్థాయిలో ఎంపీడీవోలు, పట్టణాల స్థాయిలో మున్సిపల్ కమిషనర్లు ఆథరైజేషన్ పత్రాలు ఇస్తారు. గ్రామీణ స్థాయిలో పంచాయతీ కార్యదర్శి అండ్ వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్, మునిసిపాలిటీ స్థాయిలో వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు అండ్ వార్డు వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సెక్రటరీలు బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసి సచివాయాల్లో పింఛన్‌లు పంపిణీ చేయాలని ఆ మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. లబ్ధిదారుల ఆధార్ అథెంటికేషన్ (బయోమెట్రిక్, ఐరిస్, ఆధార్ ఫేస్) ద్వారా పింఛన్‌లు పంపిణీ చేయాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. పింఛన్‌లు పంపిణీకి సంబంధించి ఎటువంటి ప్రచారాలు , వీడియోలు ప్రదర్శించవద్దని గ్రామీణాభివద్ధి శాఖ ఆదేశించింది. సచివాలయాల్లోనే పింఛన్‌లు పంపిణీ చేయాలని ఆదేశించారు.

వివక్ష మాని.. దాహం తీర్చండి

- టీడీపీ వార్డు అరుంధతి కాలనీలో తాగునీటి కష్టాలు
- రెండేళ్లుగా నీటి సరఫరాపై పట్టించుకోని సర్పంచ్
- ఎమ్మెల్యే హామీకి దిక్కులేని పరిస్థితి
- ఖాళీ బిందెలతో మహిళల నిరసన

5



కొల్లేరులో చెరువుల కోసం భూమిని చదును చేసి వేసిన గట్లు

గుట్టుగా తవ్వేస్తున్నారు..


- కొల్లేరు ఐదో కాంటూరులో చెరువు తవ్వకాలను అడ్డుకున్న డీఎఫ్‌వో
- రైతులకు నోటీసుల జారీ

ఏలూరు, మార్చి 31 : కొల్లేరు అభయారణ్య పరిధిలో ఐదో కాంటూరులో చేపల చెరువులు తవ్వితే కఠిన చర్యలు తీసుకొంటామని జిల్లా ఫారెస్టు ఆఫీసర్ హిమశైలజ అన్నారు. ఆదివారం నిడమర్రులో ఐదో కాంటూరు పరిధిలో భూములను చదును చేసుకుం టున్న రైతులకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'ఐదో కాంటూరులో ఆక్వా కల్చర్ చేయరాదు. రైతులు పట్టా భూములలో సంప్ర దాయక వ్యవసాయం చేసుకునేందుకు ఎటువంటి అభ్యంతరం లేదు. నిడమర్రు గ్రామ రైతులు వ్యవ సాయం కోసం భూమిని బాగు చేసుకుంటున్నామని చెబుతూ చేపల చెరువులకు అనుగుణంగా చేస్తున్న తవ్వకాలను అడ్డుకు న్నాం. రెవెన్యూ, పోలీసుల సహకారంతో ట్రాక్టర్లను బయటకు పంపివేసి, చెరువుల పనులు నిలిపివేశాం. రెవెన్యూ శాఖ ద్వారా రైతులపై బైండోవర్ కేసులకు నోటీసులు జారీ చేశాం. ట్రాక్టర్లు యజమానులకు నోటీసులు జారీ చేశాం. 1999 కొల్లేరు అభయారణ్యం నోటిఫికేషన్ ప్రకారం కొల్లేరు భూములను చెరువులుగా మార్పు చేయరాదు. కొల్లేరు సరస్సు పరిరక్షణకు అంద రూ భాగస్వాములు కావాలి' అని కోరారు. ఆమెతో పాటు అటవీ, రెవెన్యూ, పోలీసు యంత్రాంగం పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా కొల్లేరు ఐదో కాంటూరు భూములను చెరువులగా మార్చేందుకు అధికార వైసీపీ నాయకులు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల హడావిడిలో అధికార యంత్రాంగం ఉందని తమను పట్టించుకొనే నాథుడు ఎవరూ లేరని భావించి అధికార పార్టీ నేతల ప్రయత్నాలు చేస్తున్నారు. కొల్లేరు మాఫియా పెద్దల అండతో ఈ తవ్వకాలకు శ్రీకారం చుట్టినట్టు తెలుస్తోంది. కొల్లేరు సరస్సులో గల ఆక్వా మాఫియా ముందుగా లక్షలు పెట్టుబడి పెట్టి ఈ చెరువుల తవ్వకాలు చేపట్టినట్టు స్థానికులు ఆరోపిస్తున్నా రు. కొంత మంది స్థానిక పార్టీ నాయకులు వ్యవసాయ కూలీలలను అడ్డం పెట్టుకుని తమ భూములను చెరువులుగా మార్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిసింది. అటవీ శాఖ అధికారులు ఎంత చెప్పినా పట్టించుకోకుండా రోజుకు 100 నుంచి 150 ఎకరాల ట్రాక్టర్లు పెట్టి వ్యవసాయ భూమిని చదును చేస్తున్నామని చెబుతూ చెరువులకు అనుకూలంగా గట్లు వేస్తున్నారని సమాచారం. ఈ కొల్లేరు మాఫియా ఆగడాలను గుర్తించిన నూతనంగా వచ్చిన జిల్లా అటవీశాఖ అధికారిణి హిమశైలజ చెరువుల తవ్వకాల ప్రయత్నాలు అడ్డుకునేందుకు జిల్లా యంత్రాంగాన్ని సహకారం కోరి ఆ మేరకు చర్యలు తీసుకుని అక్రమ తవ్వకాలను అడ్డుకున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరించారు. మరోవైపు స్థానిక ప్రజాప్రతినిధి సైతం పార్టీ నాయకులను మందలించినట్టు సమాచారం. ఎన్నికల వేళ ఈ తవ్వకాలు ఏంటని వెంటనే ఆపమని మౌఖికంగా ఆదేశాలిచ్చినట్టు సమాచారం.

టీడీపీపై అభిమానం

పెళ్లి శుభలేఖపై పితాని, చంద్రబాబు, పవన్ ఫొటోలు



ఆచంట : తమ అభిమానాన్ని పెళ్లి కార్డు రూపంలో చూపడం ఈమధ్య కాలంలో ఒక ట్రెండ్‌గా మారింది. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంటకు చెందిన టీడీపీ నాయకులు కారెం ప్రేమరాజు, నాగమణి దంపతుల కుమారుడు సంజయ్ వివాహం సోమవారం జరగనుంది. ఈ కుటుంబ సభ్యులు టీడీపీపై అభిమానాన్ని చాటుకున్నారు. పెళ్లికార్డుపై పితాని సత్యనారాయణ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఫొటోలతో శుభలేక ముద్రించారు. పెళ్లికార్డుపై ఓటు ఫర్ టీడీపీ అంటూ పేర్కొనడం గమనార్హం. ఈ శుభలేఖ ను స్వయంగా కారెం ప్రేమరాజు, తనయుడు సంజయ్ పితానికి అందించారు. ప్రస్తుతం ఈ శుభలేఖ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

మావుళ్ళమ్మకు జిల్లా జడ్జి దంపతుల పూజలు

భీమవరంటౌన్, మార్చి 31 : మావుళ్ళమ్మ అమ్మవారిని ఆదివారం జిల్లా జడ్జి సి. పురుషోత్తంకుమార్ దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. ఆదివారం ఆలయానికి వచ్చిన దంపతులు అమ్మవారిని దర్శించుకోగా ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరపున ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మినగేష్ శేషవస్త్రం, ప్రసాదం, అమ్మవారి ఫొటో అందించారు.


జిల్లా జడ్జి పురుషోత్తంకుమార్‌కు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

6,7 తేదీల్లో జిల్లాస్థాయి భగవద్గీత పోటీలు

భీమవరం టౌన్, మార్చి 31 : శ్రీఉద్దరాజు ఆనందరాజు 44వ వర్ధంతి ఈనెల 13వ తేదీన పురస్కరించుకుని ఈనెల 6,7 తేదీల్లో ఆనంద గీతాయజ్ఞంలోని 108 భగవద్గీత శ్లోకాలు పఠన పోటీలు నిర్వహిస్తున్నట్టు ఆనంద గ్రూప్ ఛైర్మన్ యూకే విశ్వనాథరాజు తెలిపారు. ఆదివారం జరిగిన ఫౌండేషన్ కమిటీ సమావేశంలో పోటీల పోసర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. అన్ని వయస్సుల వారికి మూడు విభాగాలుగా.. ఐదు నుంచి పదేళ్ల వయస్సు వారు సబ్ జూనియర్స్‌గా 11 నుంచి 18 ఏళ్ల వయస్సు వారు జూనియర్స్‌గాను, 18 ఏళ్లు పైబడిన వారందరూ సీనియ ర్స్‌గా విభజించి పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మా కమిటీ ఎంపిక చేసిన 108 శ్లోకాలనే పాడాలని, ఆసక్తిగల వారు సంప్రదిస్తే పీడీఎఫ్ ద్వారా శ్లోకాలు పంపిస్తామన్నారు. ప్రతి ఒక్కరికీ భగవద్గీత రావాలని, ప్రతీ ఇంట భగవద్గీత వుండాలని ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశ్యం అని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఈనెల13వ తేదీన నిర్వహించే సభలో సర్టిఫికెట్, భగవద్గీత పుస్తకం అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.


ఆనంద గీత యజ్ఞం పోటీల పోస్టర్ ఆవిష్కరించిన దృశ్యం

గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి 5 వరకు గడువు

టి.నరసాపురం, మార్చి 31 : ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి ఈనెల 5వ తేదీ వరకు పొడిగించినట్టు ఆ పాఠశాలల ఏలూరు జిల్లా కన్వీనర్, అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డీఎస్‌టీ శంకరరావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో యాభై పాఠశాలలు, పది జూనియర్ కళాశాలలు, ఒక డిగ్రీ కళాశాల,(సాధారణ, మైనారిటీ) మొత్తం 61 విద్యాలయాలు నడపబడుతున్నాయన్నారు. ఈ పాఠశాల, కళాశాలల్లో ఖాళీలు నింపుటకు ఏప్రిల్ 25న పాఠశాల విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, కళాశాల విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా కేంద్రంలో పరీక్ష నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దరఖాస్తులు ఈనెల 5వ తేదీలోపు ఆన్‌లైన్‌లో ద్వారా పాఠశాల విద్యార్థులు రూ.100, కళాశాల విద్యార్థులు రూ.300 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.



సదస్సులో మాట్లాడుతున్న తిరుమలరావు
సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

'తిరుమల'లో అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం రూరల్,మార్చి 31: రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులోని విద్యాసంస్థల ప్రాంగణంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించినట్టు తిరుమల విద్యా సంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. తల్లిదండ్రులు పిల్ల భవిష్యత్ గురించి ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని, వారు మానసికంగా, శారీరకంగా కూడా దృఢంగా ఉండేవిధంగా సన్నద్ధం చేయాలన్నారు. జేఈఈ (మెయిన్స్, అడ్వాన్స్), నీట్ పరీక్షల్లో తరచుగా విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో పిల్లలు పుస్తకాల కన్నా ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌కు ఎక్కువగా అలవాటు పడ్డారని, వారు మొబైల్‌తో ఎక్కువ సమయం గడిపితే జరిగే నష్టాన్ని తల్లిదండ్రులు వివరించాలని చెప్పారు. విద్యాసంస్థల డైరెక్టర్ నున్న సరోజినిదేవి, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్ బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, పూర్వ విద్యార్థుల తల్లిదండ్రులు డాక్టర్ అశుతోష్ ప్రసాద్, డాక్టర్ లత, ఎం.రామకృష్ణ, జీవీ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నేరస్థులకు పోలీసుల కౌన్సెలింగ్

గణపవరం, మార్చి 31:సార్వత్రిక ఎన్నికల్లో గంజాయి వంటి మాదక ద్రవ్యాల జోలికి వెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని నిడమర్రు సీఐ ఎంవీ. సుభాష్ హెచ్చరించారు. మండలంలో గంజాయి కేసుల్లో పట్టుబడిన పాత నేరస్థులను పోలీస్‌స్టేష న్‌కు పిలిపించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎన్నికల సమయంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటా మని, శాంతియుత వాతావరణంలో ఉండాలని సీఐ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వరరావు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

డేంజర్ స్పాట్..

ప్రమాదాలకు నెలవుగా ఘాట్‌రోడ్డు కూడలి

- తగినన్ని స్పీడ్ బ్రేకర్లు లేని వైనం
- పట్టించుకోని ట్రాఫిక్ సిబ్బంది


శ్రీవారి ఘాట్‌రోడ్డుకు వెళ్లే వై.జంక్షన్


వైజంక్షన్ వైపునకు వస్తున్న వాహనాలకు ఆర్చిగేటు వద్ద స్పీడ్ బ్రేకర్లు లేని వైనం


వైజంక్షన్ వద్ద గందరగోళంగా వాహనాల రాకపోకలు

ద్వారకాతిరుమల, మార్చి 31: ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయం కొండపైకి వెళ్లే ఘాట్‌రోడ్డు కూడలి ప్రమాదాలకు నెలవుగా మారింది. వై.జంక్షన్‌గా వున్న ఆర్చిగేటు ప్రాంతంలో దాదాపు నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. వేగంగా వస్తున్న వాహనాలు ఎదురెదురై అదుపుతప్పి ఢీ కొట్టుకుంటున్నాయి. స్థానిక ఆర్చిగేటు మీదుగా నిర్మించిన ఘాట్‌రోడ్డులో తగినన్ని స్పీడ్‌బ్రేకర్లు లేకపోవడంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడి క్షతగాత్రులవుతున్నారు. శ్రీవారి దర్శనానికి వస్తున్న భక్తులు.. ఆర్చిగేటు ప్రాంతంలో తగినన్ని స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. క్షేత్రానికి వాహనాలపై వచ్చే భక్తులు ఆర్చిగేటు మీదుగా దేవస్థానం నిర్మించిన ఘాట్‌రోడ్డు వెంబడి చేరుకోవాల్సి ఉంటుంది. వాహనదారులు ఆర్చిగేటు సమీపానికి వచ్చేసరికి గుడిసెంటర్ నుంచి దేవస్థానం హైస్కూల్ మీదుగా ఏలూరు వైపు వెళ్తున్న వాహనాలు రోడ్డు పల్లంగా ఉండడంతో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న వాహనాలను ఒక్కోసారి ఢీకొడుతున్నాయి. శ్రీవారి దర్శనం చేసుకుని క్షేత్రం నుంచి వెళుతున్న భక్తులు ఆర్చిగేటులో నుంచి వచ్చే వాహనాలను, అదేవిధంగా పాతబస్టాండ్ నుంచి ఏలూరు వైపు వెళ్లే వాహనాలను గుర్తించలేకపోతున్నారు. దీంతో కొన్ని సందర్భాలలో మూడు వాహనాలు ఒకేసారి ఎదురై ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో వన్‌వేను తెలిపే విధంగా బోర్డులు లేవు. ట్రాఫిక్ నియంత్రణకు సిబ్బంది లేకపోవడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్ నియంత్రణకు పూర్తిస్థాయిలో సిబ్బందిని ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన ప్రాంతాలను గుర్తించి స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

స్పందనలో ఫిర్యాదుకు స్పందన లేదు..



ఈ సమస్యపై ఇప్పటికే స్పందనలో ఫిర్యాదు చేశా.. స్పీడు బ్రేకర్లు వేసేందుకు చర్యలు శూన్యం. ఈ సమస్యపై సీఎం స్పందినట్టు వాయిస్ రికార్డు ద్వారా అధికారులు వినిపించి క్లోజ్ చేశారు. ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వై.జంక్షన్ వద్ద మూడు వైపుల నుంచి వచ్చివెళ్లే వాహనాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. స్పీడు బ్రేకర్లు తగినన్ని లేవు. సూచికబోర్డులు లేవు వాటిని ఏర్పాటు చేయాలి.

\- గోపు కిరణ్, ద్వారకాతిరుమల

ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేయాలి



నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ఉండడం లేదు. వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు అతిక్రమించి ఇష్టానుసారంగా ప్రయాణించడంతో సమస్య తలెత్తుతుంది. ఇప్పటికైనా క్షేత్రంలోని ముఖ్యకూడళ్లలో సిబ్బందిని నియమించాలి.

\- పెద్దిరెడ్డి త్రిమూర్తులు, ద్వారకాతిరుమల

బస్టాండ్ వాష్‌రూమ్‌లో నీరులేక మూత

ద్వారకాతిరుమల, మార్చి 31: ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి పరిధిలోని భీమడోలు బస్టాండ్ మరుగుదొడ్లలో నీరులేక అవి మూతపడ్డాయి. అటు భక్తులు, ఇటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ నిత్యం ముఖ్యంగా శని, ఆది వారాల్లో శ్రీవారి క్షేత్రానికి వచ్చే భక్తులు ఈ బస్టాండ్ నుంచే వెళ్తుంటారు. ఇంత రద్దీగా ఉండే బస్టాండ్‌లో ప్రయాణికుల కనీస అవసరాలను తీర్చేలా నీరు లేకపోవడం అధికారుల నిర్లక్ష్యంగా స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి మరుగుదొడ్లకు నీటిసదుపాయాన్ని మెరుగుపర్చాలని కోరుతున్నారు.



భీమడోలు బస్టాండ్‌లో నీరులేదన్న బోర్డు

వివక్ష మాని.. దాహం తీర్చండి

- ఖాళీ బిందెలతో మహిళల నిరసన
- టీడీపీ వార్డు అరుంధతి కాలనీలో తాగునీటి కష్టాలు
- రెండేళ్లుగా నీటి సరఫరాపై పట్టించుకోని సర్పంచ్
- ఎమ్మెల్యే హామీకి దిక్కులేని పరిస్థితి

ముసునూరు, మార్చి 31 : తెలుగుదేశం పార్టీకి చెందిన వ్యక్తిని వార్డు సభ్యుడిగా గెలిపించుకోవడమే ముసునూరు మండలం రమణక్కపేట, అరుంధతి కాలనీ వాసులకు శాపమైంది. ఫలితంగా గొంతు నింపుకునేందుకు గుక్కెడు నీళ్ల కోసం రెండేళ్లుగా పొలాల్లో ఉన్న మోటార్ల వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. దీనిపై ఎన్నికల ప్రచారానికి వచ్చిన నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావును కాలనీవాసులు నిలదీశారు. 24 గంటల్లో మీ సమస్య పరిష్కరిస్తానని ఇచ్చిన హామీ కూడా నాలుగు రోజులు గడిచినా నెరవేరలేదు. ఫలితంగా రమణక్కపేట అరుంధతి కాలనీ మహిళలు ఖాళీ బిందెలతో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ప్రాంతం చూడం, కులం చూడం, మతం చూడం, రాజకీయాలు అసలే చూడమంటూ ఓ పక్క సీఎం జగన్ చెబుతుంటే స్థానిక వైసీపీ సానుభూతిపరుడైన సర్పంచ్ మాత్రం తమకు తాగునీరు కూడా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తూ వివక్ష చూపుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు కాలనీకి తాగునీరు అందించేలా చర్యలు చేపట్టకపోతే ఎంపీడీవో కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు.


ఖాళీ బిందెలతో రమణక్కపేట అరుంధతినగర్ మహిళల ఆందోళన

వివక్ష చూపుతున్న సర్పంచ్



అరుంధతినగర్‌లో 11వ వార్డు టీడీపీ అనుకూల అభ్యర్థి గెలిచారు. రెండేళ్ల నుంచి తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నా సర్పంచ్ మాత్రం వివక్షత చూపుతున్నారు. సంబంధిత అధికారులకు సమస్యపై వినతి పత్రాలు అందజేసినా నేటికీ పట్టించుకున్న వారు లేరు. ఎమ్మెల్యేకి పలుమార్లు నీటి సమస్యపై తెలిపాం. సమస్య పరిష్కరిస్తానని చెప్పి ఏడాదైనా సమస్య యథివిధిగా ఉంది. ఇటీవల కాలనీలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యేను నిలదీయగా, రెండురోజుల్లో సమస్య పరిష్కరిస్తానని చెప్పి హామీ ఇవ్వగా నాలుగురోజులు పూర్తతున్నా ఎటువంటి చర్యలు లేవు.

\- నందిపాం సత్యరాజు, రమణక్కపేట, 11వ వార్డు సభ్యుడు

రెండేళ్లుగా నరకం చూస్తున్నాం..



అరుంధతినగర్‌లో తాగునీరు లేక రెండేళ్ల నుంచి నరకం చూస్తున్నాం. నీటికోసం చుట్టుపక్కల ఉన్న పంటపొలాల్లో మోటార్ల వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి. పంచాయతీ పాలకులు, అధికారులు అరుందతీ నగర్‌పై వివక్ష చూపుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు నీటి సమస్యను పరిష్కరించాలి.

\- ఆముదాల శిరీష
రమణక్కపేట, అరుంధతినగర్ కాలనీవాసి

చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం

ముగ్గురి నుంచి రూ.2.02 లక్షలు నగదు స్వాధీనం

కామవరపుకోట, మార్చి 31 : స్థానిక కొత్తూరులోని ఆర్అండ్‌బీ బంగ్లా సెంటర్‌లో అధికారులు, పోలీసులు సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఎన్నికల చెక్‌పోస్టు వద్ద ఆదివారం ముగ్గురు వ్యక్తుల నుంచి 2.02 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్టు తహసీల్దార్ జీవీఆర్ రమేష్, డీటీ ఎం.డి. మొహిద్దీన్, ఎస్ఐ జయబాబు తెలిపారు. ఏలూరుకు చెందిన వ్యక్తి నుంచి రూ.52.900, పెద తాడేపల్లికి చెందిన వ్యక్తినుంచి రూ.62,700, కామవరపుకోటకు చెందిన వ్యక్తినుంచి రూ.86.400 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. సంబంధిత ధ్రువపత్రాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకుని ఫ్లయింగ్ స్క్వాడ్‌కు చెందిన సత్యవేణికి అందజేశారు. తడికలపూడి ఎస్ఐ జయబాబు, కె. రామకృష్ణ, జి.సూర్యారావు, ఏఎస్ఐ వీరాస్వామి, నాగార్జున, షేక్ నాగూర్‌సా హెబ్, మధు, సాయి తదితరులు పాల్గొన్నారు.


కామవరపుకోట ఎన్నికల చెక్‌పోస్టు వద్ద అధికారులు, పోలీసులు

జీలుగుమిల్లిలో రూ.95వేలు సీజ్

జీలుగుమిల్లి, మార్చి 31 : జీలుగుమిల్లిలో ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద రూ.95వేలు నగదు తహసీల్దారు ఆర్‌.వి.వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో పట్టుకున్నారు. ఎన్నికల తనిఖీల్లో భాగంగా హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న ఐషర్ వ్యాన్ డ్రైవర్‌ను ఆపి పోలీసులు తనిఖీ చేశారు. డ్రైవర్ మహ్మద్ రఫీ వద్ద ఎటువంటి ఆధారాలు లేని రూ.95వేలు నగదు గుర్తించారు. కేసు నమోదు చేసి స్వాధీనం చేసుకున్న నగదు ప్రభుత్వ ఖజానాకు అప్పగించనున్నట్టు ఎన్నికల మండల అధికారి ఆర్వీ వెంకటేశ్వరావు తెలిపారు. చెక్‌పోస్టు సూపరింటెండెంట్ ప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ బి.సత్యనారాయణ, వీఆర్వో రాజు ఉన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఆకివీడు, మార్చి 31: విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. గుమ్ములూరుకు చెందిన పంతగాని యోహాన్(55) గత నెల మార్చి 27న ఆకివీడు నుంచి గుమ్ములూరు వైపు మోటారు సైకిల్‌పై వెళుతుండగా ఎదురుగా మరో మోటారు సైకిల్‌పై ఓ వ్యక్తి వేగంగా వచ్చి ఢీ కొనడంతో తీవ్ర గాయాలవ్వడంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి యోహాన్‌ను తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. యోహాన్ బావ వెంకటేష్ ఫిర్యాదు మేర ఎస్ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడితో లేగదూడ మృతి

పోలవరం, మార్చి 31 :వీధికుక్కల దాడిలో లేగదూడ మృతి చెందిన ఘట నపోలవరం మండలం పట్టిసీమ పంచాయతీ బంగారమ్మపేటలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన సరిమిల్లి భద్రం అనే పాడి రైతుకి చెందిన లేగదూడను వీధి కుక్కలు చంపి కొంతమేర తిని స్థానికలు బెదిరించడంతో వదిలి వెళ్లాయని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో ఊరకుక్కల సంతతి పెరిగిందని, రోడ్డుకి ఇరువైపులా ఇటీవల వెలసిన మాంసం దుకాణాల వద్ద ఆ దారిన వెళ్లే పాడి పశువులు, పెరటి కోళ్లను చంపుకు తింటున్నాయి. ఒక్కోసారి చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగులు, వాహనాలపై వెళ్లేవారిపై దాడులకు పాల్పడుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. మాంసం దుకాణాలను పోలవరం మార్కెట్‌లోకి తరలించేలా చర్యలు తీసుకోవాలని, ఈ విషయంపై ఎన్నోసార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.


దూడ కళేబరం

బీరు బాటిళ్లు స్వాధీనం.. ఒకరిపై కేసు

ఏలూరు క్రైం, మార్చి 31 : బీరు బాటిళ్లు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించడానికి తీసుకువెళ్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు పడమరవీధి రాజాబత్తుల నాగసాయికిరణ్ పది బీరు బాటిళ్లను అధికధరలకు విక్రయించడానికి నగరంలో ఆదివారం తీసుకువెళ్తున్నారు. ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద త్రీటౌన్ సీఐ వి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా అతడు చిక్కాడు. ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేసి బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతడిని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంగానమ్మ గుడి విగ్రహ ప్రతిష్ఠ వివాదం

- అధికారపార్టీ ఎంపీటీసీ తీరుపై దోసపాడు గ్రామస్థుల నిరసన

దెందులూరు, మార్చి 31 : దోసపాడులో గత వారం రోజులుగా అధికార పార్టీకి చెందిన ఎంపీటీసీకి, గ్రామస్థులకు మధ్య వివాదం కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది. వివరాలివి.. గ్రామస్థులందరూ చందాలు పోగుచేసుకుని ఊరులో గంగానమ్మగుడిని నిర్మించుకున్నారు. గతనెల రోజుల క్రితం గ్రామస్థులందరూ ఎంపీటీసీతో సహా ఏప్రిల్ ఒకటిన అమ్మవారి ఊరేగింపు, తదితర కార్యక్రమాలకు ముహూర్తం ఖరారు చేసుకుని ఏర్పాట్లు చేసుకు న్నారు. ఈ క్రమంలో ఎంపీటీసీ తల్లి మృతి చెందడంతో గ్రామస్థులను కలిసి విగ్రహ ప్రతిష్ఠను నిలుపుదల చేయాలని కోరారు. ముహూర్తం పెట్టిన వేదపండితుల సలహాతో ముందుకు వెళదామంటూ వేదపండితులకు విష యం తెలుపగా ముహూర్తం పెట్టిన తరువాత ఆగితే గ్రామానికి కలిసి రాద ని సూచించడంతో విగ్రహ ప్రతిష్ఠ చేసేందుకు నిర్ణయించారు. దీనిపై ఆగ్రహించిన ఎంపీటీసీ తాను లేకుండా విగ్రహ ప్రతిష్ఠ చేయడం కుదర దన్నారు. ఎంపీటీసీ, గ్రామస్థులు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసులతో గ్రామస్థులు మాట్లాడుతూ వేదపండితుల సూచనల మేరకు చనిపోయిన వారి పేరుమీద ముహూర్తం పెట్టలేదు కావున విగ్రహ ప్రతిష్ఠ చేసుకోవాలని సూచించారని తెలిపారు. ఈక్రమంలో ఆదివారం ఎంపీటీసీ గంగానమ్మ గుడి వద్దకు వచ్చి తాము లేకుండా విగ్రహ ప్రతిష్ఠ వద్దని, వాయిదా వేయాలని అనడంతో గ్రామస్థులకు ఎంపీటీసీ అనుచరులకు వివాదం జరిగింది. దీంతో గ్రామస్థులు అధిక సంఖ్యలో దెందులూరు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఎంపీటీసీపై ఫిర్యాదు చేసి ఆందోళన చేశారు. పోలీసులు ఇరువర్గాలకు సర్దిచెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ఎంపీటీసీ వినకపోవడంతో వాయిదా వేసుకోవాలని పోలీసులు గ్రామస్థులు సూచించారు. ఈ వివాదం కొనసాగుతుండడంతో సోమవారం ఉదయం అమ్మవారి ఊరేగింపు సమయంలో ఇరువర్గాల మధ్య ఎటువంటి సమస్యలు తలెత్తుతాయో వేచి చూడాలి.


దెందులూరు పోలీస్‌స్టేషన్ వద్ద దోసపాడు గ్రామస్థుల నిరసన

ఫార్మాసిస్టు అదృశ్యం

ఏలూరు క్రైం, మార్చి 31 : ఒక మెడికల్ షాపులో పనిచేస్తున్న ఫార్మాసిస్టు అదృశ్యమైందని ఆమె తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏలూరు టూటౌన్ పోలీసులు తెలిపారు. ఏలూరు గన్‌బజార్‌కు చెందిన రుద్ర నీలిమ ఆర్ఆర్‌పేటలోని ఒక మెడికల్ షాపులో ఫార్మాసిస్టుగా పనిచేస్తుంది. ఈనెల 30వ తేదీ ఉదయం నుంచి ఆమె కనిపించడంలేదని ఆమె తల్లి జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.


ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయ ప్రాంగణంలో భక్తులు

వెంకన్న సన్నిధిలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, మార్చి 31:ద్వారకాతిరుమల శ్రీవారి దివ్యక్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అందరికీ సెలవు రోజు కావడంతో పాటు తిథి మంచిది కావడంతో ఆలయానికి భక్తుల రాక ప్రారంభమైంది. ఆలయం లోని అన్ని విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. దాదాపు 15 వేల మంది భక్తులు వచ్చినట్టు ఆలయవర్గాలు భావిస్తున్నాయి. శ్రీవారి దర్శనానికి రెండు గంటల పైబడి సమయం పట్టింది. మధ్యాహ్నం నుంచి రద్దీ తగ్గుముఖం పట్టింది. దర్శనానంతరం వారంతా స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

భూహక్కు చట్టం రద్దు చేసేవరకు పోరాటం

ఏలూరు క్రైం, మార్చి 31 : రాష్ట్రంలో భూయాజమాన్య హక్కుల చట్టం రద్దు జరిగే వరకూ ఆలిండియా లాయర్స్ యూనియన్ పోరాడుతుందని యూనియన్ జాతీయ కార్యనిర్వహణ అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఏలూరు సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఆలిండియా లాయర్స్ యూనియన్ కమిటీ సమావేశం కెంగర కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలిండియా న్యాయవాదులు ప్రజల సమస్యలపై అనేక పోరాటాలు చేసి సాధించిందన్నారు. రాష్ట్రంలో ఉన్న 531 కోర్టుల పరిధిలో కనీస సౌకర్యాలు లేక కక్షిదారులు, న్యాయవాదులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోర్టులలో న్యాయమూర్తులు, ఉద్యోగ నియామకాలు జరుగక ఖాళీలు ఉండడం వల్ల ప్రజలకు న్యాయం అందించడంలో ఆలస్యం జరుగుతుందన్నారు. వీటి పరిష్కారానికి ఐలూ కృషి చేస్తుందన్నారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు మాట్లాడుతూ దేశంలోని న్యాయవ్యవస్థను భయపెట్టాలని కొంతమంది న్యాయవాదులు, రాజకీయ నాయకులకు లోబడి దేశంలోని ప్రధాన న్యాయమూర్తికి లెటర్ రూపంలో పంపడం సరైనది కాదన్నారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఐలూ అధ్యక్షుడు కొట్టు సత్యనారాయణ, ఏపీ ఐలూ గౌరవ అధ్యక్షుడు దిగుపాటి రాజ్‌గోపాల్, ఏపీ హైకోర్టు ఐలూ అధ్యక్షుడు నర్రా శ్రీనివాస్, పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విశైలజ, కామన మునిస్వామి, సభ్యులు గెద్ద విజయభాస్కర్, పుత్సల వెంకట్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

జూనియర్ డాక్టర్ మోసాలు

- నమ్మకంగా వైద్యం చేస్తూ మత్తు మందు ఇచ్చి ఆపై ఇంటిని దోచేయడం
- మత్తు వికటించి మృతి చెందిన రిటైర్డ్ ఉద్యోగి
- డాక్టర్‌పై హత్య, దొంగతనం కేసుల నమోదు

ఏలూరు క్రైం, మార్చి 31 : వైద్యవృత్తిలో ఉన్న ఓ వైద్యుడు ఒక రిటైర్డ్ పోస్టల్ ఉద్యోగికి ఇంజక్షన్ చేసి హతమార్చాడు. ఆపై ఆ ఇంట్లో ఉన్న నగదు, బంగారు ఆభరణాలు అపహరించుకుపోయాడు. సహజ మరణమని భావించిన కుటుంబ సభ్యులు అంత్యక్రియలు జరిపారు. కొంతకాలానికి ఆ డాక్టర్ ప్రవర్తనపై అనుమానం కలగడంతో బాధితులు ఆ వైద్యుడే హతమార్చాడంటూ ఏలూరు రూరల్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేయడంతో ఆ వైద్యుడిపై దొంగతనం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. పోస్టల్‌శాఖలో ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందిన బత్తిన మల్లేశ్వరరావు(63) ఏలూరు రూరల్ మండలం చొదిమెళ్ళలో సొంత నివాసంలో ఉంటున్నారు. తన మేడ మొదటి అంతస్తులో తన కుమారుడు సోమేశ్వరరావు కుటుంబం నివాసం ఉంటున్నారు. మల్లేశ్వరరావు ఒక్కరే కింద నివాసం ఉంటున్నారు. అనారోగ్యం చేసినప్పుడల్లా ఏలూరులోని చైత్ర ఆసుపత్రికి తీసుకువెళ్ళేవారు. అక్కడ జూనియర్ డాక్టర్‌గా ఉన్న చొదిమెళ్ళ ప్రాంతానికి చెందిన డాక్టర్ కొవ్వూరి భానుసుందర్ వారికి పరిచయమయ్యాడు. ఏదైనా ఇబ్బంది అనిపిస్తే తానే ఇంటికి వస్తానని నమ్మబలికాడు. తరచుగా వస్తూ ఇంజక్షన్లు చేస్తూ ఉండేవాడు. మల్లేశ్వరరావు ఒంటరిగా జీవించడం ఆయన వద్ద బంగారం, నగదు ఉండడాన్ని గమనించాడు. చివరకు డాక్టర్ భానుసుందర్ గత ఏడాది డిసెంబరు 24వ తేదీన మల్లేశ్వరరావు ఇంటికి వచ్చి ఇంజక్షన్ చేయడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే ఏడుంపావు కాసుల బంగారు వస్తువులు, కొంత నగదు అపహరించుకుని వెళ్ళిపోయాడు. మల్లేశ్వరరావుది సహజ మరణమేనని భావించి కుమారుడు బత్తిన సోమశేఖర్, బంధువులు కలిసి అంత్యక్రియలు నిర్వహించారు. ఆ తరువాత ఆ వైద్యుడిపై ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో మూడు కేసు నమోదు కాగా, ఏలూరు వన్‌టౌన్‌లో ఒక కేసు నమోదైంది. అతడు నమ్మకంతో వైద్యం చేస్తానని ఇళ్లకు వచ్చి మత్తు ఇంజక్షన్ ఇచ్చి ఆపై ఇంట్లో విలువైన ఆభరణాలు, నగదు అపహరించుకుపోతూ ఉంటాడని ఫిర్యాదులో నమోదయ్యాయి.

ఈ ఘటనలతో వైద్యుడిపై అనుమానం కలిగి సోమశేఖర్ అతడిని ప్రశ్నించడానికి ప్రయత్నించగా అప్పటినుంచి పరారీలో ఉన్నాడు. అతడి తల్లిదండ్రులు రాజీకి రావడంతో అతడే తన తండ్రిని ఇంజక్షన్ చేసి హత్య చేశాడని ప్రాథమికంగా నిర్ధారణ చేసుకున్నారు. ఏలూరు రూరల్ పోలీసులకు బత్తిన సోమశేఖర్ ఫిర్యాదు చేయడంతో రూరల్ ఎస్ఐ కె.రాజారెడ్డి ఆదివారం కేసు నమోదు చేశారు. డాక్టర్ కొవ్వూరి భానుసుందర్‌పై హత్యా కేసు, దొంగతనం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న డాక్టర్ భానుసుందర్ కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.



రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి, మార్చి 31: రాట్నాలకుంట రాట్నాలమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పాలపొంగలి నైవేద్యంగా సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు పావులూరి సత్యనారాయణశర్మ, రుద్రపాక శేషగిరిరావు, పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన చేశారు. నిర్వహించారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఈవో సతీష్‌కుమార్ తెలిపారు.

ఏలూరులో వైభవంగా నూకాలమ్మ జాతర



కలశాలతో మహిళల ఊరేగింపు

ఏలూరు కార్పొరేషన్, మార్చి 31. స్థానిక కొత్తపేటలోని గ్రామదేవత నూకాలమ్మ జాతర ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. మహిళలు 108 కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కుబడులు చెల్లించుకున్నారు. అర్చకులు మంత్రవాది రామకృష్ణ భక్తులతో పూజలు చేయించారు. ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది. జాతర సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ తగు ఏర్పాట్లు చేశారు.

ముగిసిన సరమ్మ పేరంటాలు ఉత్సవాలు

లింగపాలెం, మార్చి 31: లింగపాలెంలో వారం రోజులుగా జరుగుతున్న సరమ్మ పేరంటాల ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. స్వామి, అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. పూజ అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

రేపటి నుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు



ఏలూరు కల్చరల్, మార్చి 31: శనివారపుపేట చెన్నకేశవస్వామి ఆలయంలో మంగళవారం నుంచి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఆలయంలో ప్రధాన దైవం చెన్నకేశవ స్వామి విష్ణుస్వరూపం, అదే ఆలయ సముదాయంలో శివుని రూపమైన రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక మందిరం ఉంది. ఆలయం 10వ శతాబ్దంలో వేంగి చాళుక్యులు నిర్మించినట్లు ఇక్కడి శాసనాల ద్వారా తెలుస్తోంది. 18వ శతాబ్దంలో నూజివీడు జమిందార్ మేకా అప్పారావు ఆలయాన్ని పునర్నిర్మించారు. ఉత్తరాది ముఖంగా ఉన్న చెన్నకేశవ ఆలయం, తూర్పు ముఖంగా రామలింగేశ్వర స్వామి ఆలయం ఉన్నాయి. ఒకే గర్భగుడిలో విష్ణువు రెండు రూపాలు కలిసి ఉంటాయి. శ్రీదేవి, భూదేవితో పాటు ప్రధాన దేవత చెన్నకేశవ స్వామి కింద శంఖం, సుదర్శనచక్రాన్ని పట్టుకుని వెంకటేశ్వరస్వామిగా విష్ణువును చూడవచ్చు. ఆలయాన్ని ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి దేవస్థానం దత్తత తీసుకుంది. ఏటా బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 2 నుంచి 8 వరకు బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలి

అగ్నిమాపక శాఖ డీజీపీ సునీల్‌కుమార్



చింతలపూడి, మార్చి 31: ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును వినియోగించుకోవాలని రాష్ట్ర ఫైర్ సర్వీస్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డీజీపీ పి.విసునీల్ కుమార్ అన్నారు. ఆదివారం ఈస్టర్ సందర్భంగా బోయగూడెం, సుప్రియన్‌పేట, సీయస్ఐ చర్చిలలో ఆయన ప్రార్థనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఓటుహక్కును వినియోగించుకోవడంలో ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. అనంతరం కొవ్వూరుగూడెంలో జోసఫ్ కుటుంబం, ఫాతిమాపురంలో బాలస్వామి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట ఎయిమ్ నిర్వాహకులు ఎన్ఎస్ రాజేంద్ర, కాకర్ల సత్యనారాయణ, కంచర్ల బుచ్చిబాబు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. బట్టువారిగూడెంలో బైబిల్‌మిషన్ చర్చిలో ఆరాధన కార్యక్రమంలో కోటగిరి విద్యాధరరావు కుమార్తె పొన్నాల అనితమ్మ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్ లంకా ఏసుదాసు, లంకా జయబాబు, వెంకన్న, నాగరాజు పలువురు భక్తులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం సమావేశంలో సొంగా రోషన్‌కుమార్



జయహో బీసీ సభలో చంటి, అప్పలనాయుడు, నేతలు



అప్పనవీడులో సూపర్ సిక్స్ పథకాలపై టీడీపీ ప్రచారం



ఉంగుటూరులో టీడీపీ, జనసేన, బీజేపీ నేతల సమావేశం

బీసీలపై జగన్ ఉక్కుపాదం

వైసీపీ పాలనపై టీడీపీ, జనసేన నేతల ధ్వజం

ఏలూరు టూటౌన్, మార్చి 31: టీడీపీకి అండగా ఉంటున్నారనే అక్కసుతో జగన్ బీసీలపై ఉక్కుపాదం మోపి అణచివేసే ధోరణి అవలంబించారని టీడీపీ జనసేన, బీజేపీ, ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి, జనసేన ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు అన్నారు. 41, 42 డివిజన్‌లో ఆదివారం జయహో బీసీ సభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత 74 మంది బీసీలు హత్యకు గురయ్యారన్నారు. 800 మందిపై అక్రమ కేసులు బనాయించారన్నారు. టీడీపీ ప్రభుత్వం ఆదరణ పథకాన్ని పెట్టి బీసీ కుల వృత్తులకు రాయితీ పథకాలు ఇచ్చారని గుర్తు చేశారు. చంద్రబాబు నాయుడు బీసీలకు 34శాతం రిజర్వేషన్లు ఇచ్చారని, జగన్ వాటిని 24 శాతానికి తగ్గించారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో బీ.బాలాజీ, సంతోషి ప్రసాద్, త్రిపర్ణరాజేష్, శ్రీనివాస్, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు టీడీపీతోనే న్యాయం : రోషన్

జంగారెడ్డిగూడెం: బీసీలకు తగిన ప్రాధాన్యత టీడీపీలోనే దక్కుతుందని చింతలపూడి నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు అధ్యక్షతన జయహో బీసీ సమావేశం నిర్వహించారు. రోషన్ కుమార్ మాట్లాడుతూ బీసీలకు 50 ఏళ్లకే రూ.4వేలు పెన్షన్, బీసీ రక్షణ చట్టం, 5 ఏళ్లలో రూ.1.50లక్షల కోట్లు నిధులు కేటాయింపు, 34 శాతానికి రిజర్వేషన్లు తదితర అంశాలను హామీలుగా మేనిఫెస్టోలో పెట్టారన్నారు. బీసీలకు న్యాయం టీడీపీతోనే సాధ్యమన్నారు. బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, చిత్రోజు తాతాజీ, తూటికుంట దుర్గారావు, రాము, రావూరి కృష్ణ, మండవ లక్ష్మణరావు, చేను ప్రసాద్, ఈర్ని సూరిబాబు, మానికల సూరిబాబు, మూర్తి, తెలగారపు జ్యోతి, జనసేన అధ్యక్షుడు పీర్, కన్నా కృష్ణ అధిక సంఖ్యలో బీసీలు తదితరులు పాల్గొన్నారు.

అనంతరం టీడీపీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ అధ్యక్షతన జరిగిన పార్టీ సమావేశంలో రోషన్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికలతో రాష్ట్ర భవిష్యత్‌పై ఆధారపడి ఉందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రతి ఇంటికి ప్రచారం చేయాలని సూచించారు. వార్డుల వారీగా సమీక్ష నిర్వహించారు. వార్డుల్లో తెలుగుదేశం కేడర్‌ను ఉత్సాహ పరిచే కార్యక్రమాలపై చర్చించారు. మండవ లక్ష్మణరావు, పెనుమర్తి రామ్‌కుమార్, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, ఎస్‌కె ముస్తఫా, చిట్టిబోయిన రామ లింగేశ్వరరావు, తూటికుంట రాము, జనసేన నాయకులు ఎస్ పీర్, వలవల తాతాజీ, గురుజు ఉమామహేశ్వరి, కౌన్సిలర్ నంబూరి రామచంద్రరాజు, కరుటూరి రమాదేవి, తెలగారపు జ్యోతి, గుమ్మడి ప్రసాద్, పగడం సౌభాగ్యవతి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. 6వ వార్డుకు చెందిన పలువురు జనసేన, టీడీపీలో చేరారు.

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి

పెదపాడు: గ్రామాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని, ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ సీనియర్ నాయకుడు వేమూరి శ్రీనివాసరావు అన్నారు. అప్పనవీడులో బెక్కం లక్ష్మీనారాయణ అధ్యక్షతన టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, తిరిగి అభివృద్ధి పథంలో నడపాలంటే చంద్రబాబు పాలనలోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో వడ్డి వాసవి, పావులూరి రామారావు, బోయపాటి దీపు తదితరులు పాల్గొన్నారు.

క్రిమినల్ కేసుల్లో జగన్ : పుట్టా మహేష్ యాదవ్

ఉంగుటూరు: క్రిమినల్ కేసుల్లో జగన్ నిందితుడని, ప్రతి ఒక్కరూ తెలుసుకుని ఓటు వేయాలని టీడీపీ కూటమి ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ అన్నారు. ఉంగుటూరు జనసేన కార్యాలయంలో ఆదివారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అధ్యక్షతన జనసేన, టీడీపీ, బీజేపీ ఆత్మీయ సమావేశం జరిగింది. గన్ని మాట్లాడుతూ మూడు పార్టీల కార్యకర్తలు కష్టించి పనిచేసి పార్లమెంటుకు సైకిల్, అసెంబ్లీకి గాజు గ్లాసు గుర్తుకు ఓటు వేయించేలా బాధ్యత తీసుకోవాలన్నారు. పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ ఆక్వా రంగాన్ని కుదేలు చేసిన జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శరణాల మాలతీరాణి మాట్లాడుతూ దేశం చిట్ట చివరి వ్యక్తిని కూడా అభివృద్ధి చేయాలనే తలంపుతో మోదీ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్, మూడు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి వైపు నడిపేది చంద్రబాబు : చింతమనేని

పెదవేగి: అప్పుల ఆంధ్రాగా మారిన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టి, అభివృద్ధి దిశగా నడిపే సమర్థుడైన డ్రైవర్ చంద్రబాబునాయుడని చింతమనేని ప్రభాకర్ అన్నారు. కవ్వగుంటలో జనసేన ఏర్పాటు చేసిన ఆత్మీయ సదస్సులో ప్రభాకర్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటినుంచి రాష్ట్రం తిరోగమనంలో పడిందన్నారు. పరిశ్రమలను తరిమేసి, యువతకు ఉపాధి అవకాశాలను లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సమర్థుడైన చంద్రబాబుకు అండగా నిలివాలన్నారు. ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. ఘంటసాల వెంకటలక్ష్మి, పసుపులేటి భార్గవ్, మోరు నాగరాజు, మడిచర్ల కృష్ణ, ముత్యాల రాజేష్, శెట్టిపల్లి సందీప్, బెజవాడ శివనాగరాజు, చలమాల సాయి, బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, సుగసాని గంగాధరరావు, కొట్టు నరేష్, పాల్గొన్నారు.







ఏలూరులో మాట్లాడుతున్న స్వీప్ అధికారి విశ్వనాథ్, పెదపాడు మండలం కలపర్రు వద్ద, పోలవరంలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

ఏలూరు రూరల్, మార్చి 31: సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచాలని, ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా స్వీప్ నోడల్ అధికారి, డీపీవో తూతిక శ్రీనివాస విశ్వనాథ్ చెప్పారు. ఆదివారం స్థానిక వృద్ధాశ్రమంలో (ప్రేమాలయం) స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా ఓటుహక్కు వినియోగంపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రేమాలయం అధినేత వెంకటేష్ గురూజీ, ఏలూరు తహసీల్దార్ ముఖర్జి తదితరులు పాల్గొన్నారు.

కలపర్రు టోల్‌గేట్ వద్ద వాహనాల తనిఖీ

పెదపాడు, మార్చి 31: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారులు, పోలీసులు వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. జాతీయ రహదారిపై కలపర్రు టోల్‌గేట్ వద్ద ఎన్నికల స్క్వాడ్ అధికారులతో కలిసి ఎస్సై కె.శుభశేఖర్ వాహనాలను తనిఖీ చేశారు. ఎస్సై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనల ప్రకారం ముందుకు సాగాలన్నారు. ఎక్కువ మొత్తం నగదు తరలింపుపై సంబంధిత అధికారులకు ముందుగా సమాచారం ఇవ్వాలని, సంబంధించి ధ్రువీకరణ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వాహనాల తనిఖీ సమయంలో పోలీసు సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో పెదపాడు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలవరంలో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ

పోలవరం: మండలంలో పలుచోట్ల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యం నగదు, మద్యం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే సామగ్రి అక్రమ రవాణా అరికట్టేందుకు నిరంతరాయంగా నియోజకవర్గంలో నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పనిచేస్తున్నాయని అధికారి ఎ శ్రీనివాసరావు తెలిపారు. పోలవరంలో గుంజవరం అడ్డరోడ్డు, కన్నాపురం జంక్షన్, పోలవరంలో స్థానిక ఏటిగట్టు సెంటర్ ల వద్ద పోలవరం నుంచి రాకపోకలు సాగించే వాహనాలను ఆపి క్షుణ్ణంగా పరిశీలించారు.

గ్రామాల్లో సాయుధ బలగాల కవాతు



వేలేరుపాడులో కవాతు చేస్తున్న బలగాలు

వేలేరుపాడు, మార్చి 31 : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు ధైర్యంగా పోలింగ్ స్టేషన్‌లకు వచ్చి ఓటు వేసుకునేందుకు వీలుగా పోలీసు శాఖ అన్ని చర్యలు చేపడుతుంది. దీనిలో భాగంగానే ఓటర్లకు మనోధైర్యం కల్పించే ఉద్దేశ్యంతో ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు వేలేరుపాడులో ఆదివారం సాయుధ బలగాలు, పోలీసులు కవాతు నిర్వహించారు. వేలేరుపాడుతో పాటు రుద్రమకోట, రేపాకగొమ్ము, భూదేవిపేట, రామవరం గ్రామాల్లో కేంద్ర బలగాలతో పోలీసు కవాతు నిర్వహించామని వేలేరుపాడు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

టీడీపీలో 30 కుటుంబాల చేరిక



పార్టీ కండువా కప్పుతున్న మద్దిపాటి

ద్వారకాతిరుమల, మార్చి 31: జగన్ ప్రభుత్వ అరాచకాలు నచ్చక పలువురు టీడీపీలో చేరుతున్నారని గోపాలపురం టీడీపీ కూటమి అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని మారంపల్లిలో టీడీపీ మండల అధ్యక్షుడు లంకా సత్యనారాయణ ఆధ్వర్యంలో గుణ్ణంపల్లి పంచాయతీ తక్కెళ్లపాడుకు చెందిన సుమారు 30 కుటుంబాల వారు ఆదివారం వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. వారికి సాదరంగా పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. నేతలు బొల్లారెడ్డి సూరిబాబు, చాత్రాది శ్రీను, తూంపాటి జస్వంత్, అశోక్, మటపర్తి బద్రి తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమికి ఎమ్మార్పీఎస్ మద్దతు



సమావేశమైన ఎమ్మార్పీఎస్ నాయకులు

పెదవేగి, మార్చి 31: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి మద్దతు ఇస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జొన్నకూటి జాన్ మాదిగ తెలిపారు. పెదవేగిలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ప్రతినిధులు ఆదివారం సమావేశమయ్యారు. మందా కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎన్డీఏ కూటమి విజయానికి కృషి చేస్తామని ప్రకటించారు. జాన్ మాదిగ మాట్లాడుతూ కూటమి అభ్యర్థులు చింతమనేని ప్రభాకర్, పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ గెలుపే లక్ష్యంగా మాదిగలంతా కృషి చేయాలన్నారు. టీడీపీ గెలుపుతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యపడుతుందనే నమ్మకం మాదిగలకు ఉందని, గతంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు చూపిన చొరవ కారణంగా 25 వేలమంది మాదిగలకు ఉద్యోగాలు వచ్చాయని ఆయన గుర్తు చేశారు. కూటమి విజయంతో రిజర్వేషన్ వర్గీకరణ ఫలాలను అందుకోవడానికి వీలవుతుందన్నారు. సమావేశంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు యర్రా రఘు, ఉప్పులూరి ఎలీష, దాసరి చంద్రం, తాడిగడప వెంకటపతి, మద్దాల మైకేల్, చొదిమెళ్ల ప్రసాద్, నిరీక్షణ, రాజేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ దర్శనం విజ్ఞానదాయకం

పెదవేగి, మార్చి 31: గ్రంథాలయ దర్శనం విజ్ఞానదాయకమని లైబ్రేరియన్ తోట అరుణ్‌కుమార్ అన్నారు. శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. పలువురు విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలను చదివారు. గ్రంథపఠనంతో కలిగే లాభాలను అరుణ్‌కుమార్ విద్యార్థులకు వివరించారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా గ్రంథపఠనం చేయాలని, అదే వారి జీవితాన్ని ఉన్నతమైన దిశగా నడిపిస్తుందని ఆయన తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదం

పెదవేగి, మార్చి 31: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమని, అంకితభావంతో విధులు నిర్వహించిన ఉపాధ్యాయుడు పామర్తి వెంకటేశ్వరరావును ఎంఈవో సీహెచ్.బుధవాస్ అభినందించారు. రాయన్నపాలెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రంగప్రసాద్, ఎడ్వర్డు, ఉపాధ్యాయులు పి.వెంకట రమణ, ప్రభాకర్, కుమార్, నరేంద్ర, లక్ష్మీనారాయణ, రామదుర్గ, సుధ, లక్ష్మణరావు, సీఆర్పీ ఆదామ్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో తాటికిల్లు దగ్ధం

పెదవేగి, మార్చి 31: ముండూరులో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమైంది. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. గ్రామానికి చెందిన జుజ్జువరపు చిన్న ఇంట్లో తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్‌తో మంటలు రేగాయి. ఈస్టర్ పండుగతో చర్చిలలో ప్రార్థనలు చేస్తున్న స్థానికులు స్పందించి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న ఏలూరు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను పూర్తి స్థాయిలో అదుపు చేశారు. ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నేత ఆలపాటి నరసింహమూర్తి ఆర్థికసాయం చేశారు.

ఎన్‌సీఆర్‌సీ న్యాయ సలహాదారుగా గన్నాబత్తుల విజయ

నిడమర్రు, మార్చి 31: జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ ఉమ్మడి జిల్లా న్యాయ సలహదారుగా న్యాయవాది గన్నాబత్తుల విజయ సత్యవతిని నియమిస్తున్నట్లు కమిషన్ జిల్లా చైర్మన్ లింగపల్లి మణికంఠ తెలిపారు. ఆదివారం భువనపల్లిలో ఈస్ట్‌జోన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో విజయ సత్యవతికి నియామకపత్రాన్ని వైస్ చైర్మన్ నోచర్ల శ్రీనివాసరావు, సంకు నాగేషు అందజేశారు. కార్యక్రమంలో సంకు తాతాజీ, లక్ష్మీగణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దాహార్తి తీర్చేందుకు మానవత సేవా కార్యక్రమాలు

ఉంగుటూరు, మార్చి 31: వేసవి దృష్ట్యా ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలతో పాటు జాతీయ రహదారిలో ట్రాఫిక్ నియంత్రణకు స్టాపర్లు అందిస్తామని మానవత రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి తెలిపారు. గోపీనాథపట్నంలో మానవత మండల సమావేశం అధ్యక్షులు గంజి రవి అధ్యక్షతన ఆదివారం జరిగింది. పలువురు మాట్లాడుతూ ఉంగుటూరులో నిర్మాణంలో ఉన్న ఆనంద నిలయం వృద్ధాశ్రమానికి అందరూ సహకరించాలని కోరారు. సర్పంచ్ పుత్సకాయల విష్ణుమూర్తి, అడపా శ్రీనివాస్, గుణ్ణం బుల్లెబ్బాయి, శీతాల సత్యనారాయణ, కోనే సత్యనారాయణ పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడి తీరుపై నిరసన

ఉంగుటూరు,మార్చి 31: టీడీపీ మండల అధ్యక్షుడు పాతూరి విజయ కుమార్ ఒంటెద్దు పోకడతో పార్టీకి నష్టం కలిగిస్తున్నారని నారాయణపురం గ్రామ కమిటీ ఆరోపించింది. ఈ మేరకు గ్రామ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సప్పా వీరబాబు, పుసులూరి ప్రకాష్ భీమడోలులోని గన్ని క్యాంప్ కార్యాలయంలో ముఖ్య నేతలకు ఆదివారం వినతిపత్రం అందించారు. టీడీపీకి చెందిన 20 మంది జనసేనలో చేరేందుకు ప్రోత్సహించిన విజయకుమార్ పార్టీ నష్టపోయే చర్యలు చేపడుతున్నారన్నారు.



పెదవేగి మండలం న్యాయంపల్లి చర్చిలో ప్రార్థనలు



ఉంగుటూరులో కొవ్వొత్తుల ప్రదర్శన



జీలుగుమిల్లి గ్రేస్ మందిర్ ఈస్టర్ వేడుకల్లో క్రైస్తవులు

క్రీస్తు మార్గం అనుసరణీయం

ఘనంగా ఈస్టర్ వేడుకలు

ఏలూరు కల్చరల్, మార్చి 31: లోక రక్షకుడు ఏసుక్రీస్తు పునరుత్థానం, ప్రపంచ శాంతికి సోపానమై వర్ధిల్లుతోంది. మరణంపై ఏసు గెలిచాడని క్రైస్తవుల ప్రగాఢ విశ్వాసం. జిల్లాలోని చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ వేడుకలను నిర్వహించారు. అమీనాపేట రిజర్వు పోలీస్ లైన్స్‌లోని సెయింట్‌పాల్స్ లూథరన్ చర్చిలో ఈస్టర్ వేడుకల్లో కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. రెవరెండ్ ఫాదర్ వర్ధనపు మిల్టన్ ప్రత్యేక ప్రార్థనలు చేసి కలెక్టర్ దంపతులకు, కుటుంబ సభ్యులకు ఆశీర్వచనాలు అందజేశారు. కలెక్టర్ క్రైస్తవులకు ఈస్టర్ పండుగ శుభా కాంక్షలు తెలిపారు. క్రీస్తు బోధనలు ఆదర్శనీయమన్నారు. అడిషనల్ పాస్టర్ రెవరెండ్ దానియేల్ అభిలాష్ తదితరులు పాల్గొన్నారు. రూరల్ మండలంలోని పాలగూడెం, మాదేపల్లి, జాలిపూడి, చాటపర్రు, శ్రీపర్రు, గుడివాకలంక,పత్తికోళ్ళలంక, పైడిచింత గ్రామాల్లోని చర్చిల్లో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తును ఆరాధిస్తూ ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. 40 రోజులుగా దీక్ష చేస్తున్న క్రైస్తవులు మాలలు తీసి దీక్ష విరమించారు.

- ఏలూరు టూటౌన్: నగరంలోని పలు చర్చిలలో ఈస్టర్ ప్రత్యేక ఆరాధన నిర్వహించారు. పాస్టర్లు ఈస్టర్ విశిష్టతను వివరించారు. ప్రభువైన ఏసుక్రీస్తు గుడ్ ఫ్రైడే రోజున శిలువలో మరణించి మూడో రోజు తిరిగి లేచిన సందర్భాన్ని పురస్కరించుకుని చర్చిలలో ప్రార్థనలు చేశారు. ఆర్‌సీఎం, ఐసీఎం, పెంతికోస్త్, సాల్వేషన్ ఆర్మీ, ఎల్‌ఈఎఫ్, ఒలివల ప్రార్థన మందిరం, పెనుయేలు చర్చ్‌లలో ఆరాధనలు నిర్వహించారు. ఆర్‌సీఎం అమలోద్భవి కథడ్రల్ చర్చిలో బిషప్ జయరావు పొలిమేర ఈస్టర్ సందేశం అందించారు. ఐసీఎం చర్చ్‌లో జాన్ ఎస్‌డీ.రాజు, ఎల్‌ఈఎఫ్ చర్చ్‌లో సురేష్ మార్కస్, ఒలివల ప్రార్థన మందిరంలో జే.అడమ్ సురేష్, పెనియల్ చర్చిలో జాన్‌బాబు ఈస్టర్ సందేశం ఇచ్చారు. పెనియల్ చర్చిలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేశ్, ఎమ్మెల్యే అభ్యర్థి బడేటి చంటి ప్రార్థనలు చేశారు.
- పెదవేగి: ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. న్యాయంపల్లి విచారణలో ఫాదర్ బాలస్వామి ఆధ్వర్యంలో క్రీస్తు పునరుత్థాన వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులకు క్రిస్మస్ తరువాత ప్రధానమైన పండుగ ఈస్టర్ అన్నారు. ఈస్టర్ శాంతి, సౌభ్రాతృత్వం, కరుణ, క్షమాగుణం నేర్పుతుందని చెప్పారు. క్రీస్తు బోధనలు సర్వమానవాళికి ఆచరణీయమని, క్రీస్తు మార్గంలో నడిస్తే పరలోక ప్రాప్తి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ డానియేల్ అభిలాష్, మత విశ్వాసులు పాల్గొన్నారు.
- దెందులూరు: మరణంపై ఏసు సాధించిన విజయానికి గుర్తుగా సమస్త మానవాళి ఈస్టర్ పండుగను ఘనంగా జరుపుకుంటారాని దెందులూరు ఎన్‌డీఏ కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చింతమనేని ప్రభాకర్‌రావు అన్నారు. ఆదివారం దెందులూరు ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ అమ్మాన్ రాజా ఆధ్వర్యంలో క్రీస్తు పునరుత్థాన మహోత్సవంలో చింతమనేని ప్రభాకర్‌రావు పాల్గొన్నారు. శుద్ధీకరణ మాత విగ్రహానికి పూలమాల వేసిన చింతమనేని పాదర్ అమ్మాన్ రాజాకు పుష్పగుచ్ఛం అందించి ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. సంఘస్తులు, గ్రామస్తులు, ప్రజలందరి కొరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సర్పంచ్ తోట ఏసమ్మ, మిల్లుబాబు, సంపంగి తిలక్, కొలుసు నాని. దాసే శ్రీను, కొండయ్య చౌదరి, యిప్పిలి వెంకటేశ్వరావు, మహేష్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.
- బుట్టాయగూడెం: క్రీస్తు మరణాన్ని జయించి లేచిన రోజు ఈస్టర్ పండుగను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారుజామున సమాధుల తోటకు వెళ్లి ప్రత్యేక ప్రార్థలు చేశారు. చర్చిలను అందంగా అలంకరించి ప్రపంచ మానవాళి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బుట్టాయగూడెం సెంట్ మార్క్స్ లూథరన్ చర్చిలో పాస్టర్ ఎంఎ ఆమెన్ ఈస్టర్ ప్రాముఖ్యతను వివరించారు. ఏసు చూపిన మార్గంలో పయనించి ఆదర్శవంతంగా నడుచుకోవాలన్నారు. అనంతరం సంఘస్తులకు ప్రేమవిందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డెలిగేట్ యు.సూర్యప్రకాశరావు, అల్టర్‌నేట్ డెలిగేట్ కె.విమల, బుడుపుల మాలని, విప్రసంగి, తలారి రాజు సంఘస్తులు పాల్గొన్నారు.
- పోలవరం: మండలంలో ఈస్టర్ పండుగ సందర్భంగా క్రైస్తవులు సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పోలవరం సెయింట్ పాల్ లూథరన్, హెబ్రోను, కర్మేలు, సీయోను, సెయింట్ ఫాల్, ఒలీవల, ఏఈఎల్‌సి రూపాంతర దేవాలయం, బెరాకా ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక పార్థనలు చేశారు. గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ, పోలవరం, ఇటుకలకోట, వింజరం, చేగొండపల్లి, ప్రగడపల్లి, జిల్లెల్లగూడెం, కోండ్రుకోట, ఎల్లండిపేటా గ్రామాల్లో చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి పాదర్లు, పాస్టర్లు శామ్యూల్ రాజు, పీజే.సుధాకర్, ఆకుమర్తి డేవిడ్ రాజు, సంపతరావు తదితరులు పాల్గొన్నారు.
- భీమడోలు: గ్రామాల్లో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ళ, కురెళ్ళగూడెం, సూరప్పగూడెం తదితర గ్రామాల చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సూరప్పగూడెం సాల్వేషన్ ఆర్మీ చర్చిలో మండే దేవదాతమ్మ దేవరాజు జ్ఞాపకా ర్థం వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. మండే సుధాకర్, భక్తులు సుజాత, భూషణమ్మ, హేమలత పాల్గొన్నారు.
- ఉంగుటూరు: మండలంలో ఈస్టర్ సండే వేడుకలు ఘనంగా జరిగాయి. రెవరెండ్ చెల్లప్ప ఆధ్వర్యంలో జరిగిన వేడుకలలో క్రైస్తవులు కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.
- లింగపాలెం: మండలంలోని చర్చిల్లో ప్రార్థనలు చేశారు. పాస్టర్ల ఆధ్వర్యంలో ఏసుక్రీస్తు బోధనలను వినిపించారు. క్రైస్తవులు క్రీస్తుబోధనలను అనుసరించి నడుచుకోవాలని పాస్టర్లు సూచించారు.
- జీలుగుమిల్లి: ఏసు క్రీస్తు మానవాళిని రక్షించేందుకు భూమి పైకి వచ్చారని, క్రీస్తు చూపిన మార్గంలో విశ్వాసులంతా నడవాలని పాస్టర్ ఎజ్రాశాస్త్రి అన్నారు. జీలుగుమిల్లి గ్రేస్‌మందిర్ చర్చి వద్ద ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిపారు. ఏసుకు విశ్వాసులు ప్రార్థనలు చేశారు. మరణాన్ని జయించిన విజయశాలిగా కీర్తించారు. అధిక సంఖ్యలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.
- నిడమర్రు: ఏసుక్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరూ అనుసరించడం ద్వారా శాంతి, సౌభ్రాతృత్వం పెంపొందుతాయని ఉంగుటూరు కూటమి ఉమ్మడి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. పెదనింద్రకొలను ఆర్‌సిఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. చర్చి ఫాదర్ అజయ్ సాంసన్ వారికి ప్రత్యేక దీవెనలు అందజేశారు. క్రైస్తవులు, జనసేన నాయకులు వంగా రఘు, బాసిరాజు, లంకా రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



సెయింట్‌పాల్స్ లూథరన్ చర్చిలో కుటుంబ సమేతంగా కలెక్టర్ ప్రార్థనలు



బుట్టాయగూడెం చర్చిలో క్రీస్తు సందేశం ఇస్తున్న పాస్టర్



దెందులూరు చర్చిలో ఈస్టర్ వేడుకల్లో చింతమనేని



భీమడోలు చర్చిలో చీరల పంపిణీ



పోలవరంలో సమాధుల వద్ద ప్రార్థనలు


నూజివీడులో ప్రత్యేక ప్రార్థనలు


చనుబండ చర్చిలో ప్రార్థనలు


రాచపట్నంలో ఈస్టర్ శుభాకాంక్షలు తెలుపుతున్న కామినేని


ముదినేపల్లి ఆర్‌సీఎం చర్చిలో

భక్తిశ్రద్ధలతో ఈస్టర్

నూజివీడు టౌన్, మార్చి 31: ఈస్టర్ పర్వదినాన్ని నూజివీడు పట్టణ, మండల ప్రాంతాల్లోని చర్చిల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దైవజనులు క్రీస్తు పునరుత్థాన ఘట్టాలను వివరిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

చాట్రాయి: మండలంలో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చనుబండ పెంతెకోస్తు చర్చిలో జరిగిన వేడుకల్లో పాస్టర్ పురషోత్తం చౌదరి మాట్లాడుతూ క్రీస్తు ప్రవచించిన కరుణ, ప్రేమ మార్గాలను ప్రతి ఒక్కరు ఆచరించాలని, కష్టాల్లో తోటివారికి శక్తి మేరకు సాయపడాలన్నారు. మండలంలోని అన్ని చర్చిలలో సామూహిక ప్రార్థనలు జరిగాయి. సర్పంచ్ విస్సంపల్లి జ్యోతి, ఎంపీటీసీ చింతగుంట్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముసునూరు: మండల వ్యాప్తంగా చర్చిల్లో ఆదివారం వేకువజాము నుంచి మత గురువులు ఈస్టర్ ప్రార్థనలు నిర్వహించారు. ముసునూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ జోసఫ్ తంబి, సహాయ గురువులు గాంధీ రాజా ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి, ప్రార్థనలు చేశారు. సర్వమానవాళి పాపాలను హరించేందుకు శిలువ వేసి సమాధి చేసిన మూడోరోజు ఏసుక్రీస్తు పునరుత్థానుడయ్యాడని, ఆయన చూపిన ప్రేమ, దయ, క్షమ మార్గాల్లో ప్రతిఒక్కరూ నడుచుకోవాలని కాగా జోసఫ్ తంబి ఉద్బోధించారు.

ఆగిరిపల్లి: గాడ్ ఆఫ్ గాడ్ మినిస్ట్రీస్ చర్చిలో ఈస్టర్ ప్రార్థనలు జరిగాయి. బ్రదర్ కె.చినబాబు మాట్లాడుతూ మానవులంతా పాపాలు విడిచిపెట్టి కొత్త జీవితంలోకి వెళ్ళాలని, క్రీస్తు బోధనలు ఆచరించాలన్నారు.

కైకలూరు: ఈస్టర్ పండుగను గ్రామాల్లో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదివారం ఉదయాన్నే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వరహాపట్నం, రాచపట్నం, గోపవరం గ్రామాల్లో ఆయా ప్రార్థనా మందిరాల్లో బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ వారికి ఈస్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరూ ఆచరించాలని కోరారు. అలాగే పల్లెవాడ గ్రామంలోని బైబిల్ మిషన్ ప్రార్థనా మందిరంలో జరిగిన ఈస్టర్ వేడుకల్లో మాజీ జెడ్పీటీసీ బొమ్మనబోయిన విజయలక్ష్మీ పాల్గొన్నారు. వాడవాడల ఈస్టర్ పండుగను సువార్తకులు పెద్దఎత్తున జరుపుకున్నారు.

కలిదిండి: మండలంలో ఆదివారం క్రైస్తవులు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దైవసేవకులు మాట్లాడుతూ క్రీస్తు బోధనలను అనుసరిస్తూ ప్రేమ, శాంతి, అహింసా మార్గంలో నడవాలన్నారు. భాస్కరరావుపేట, గుర్వాయిపాలెం, కోరుకొల్లు చర్చిల్లో పెద్ద ఎత్తున ప్రార్థనలు జరిగాయి.

ముదినేపలి: ముదినేపల్లిలోని ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ మరియన్న ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన వందలాది మంది క్రైస్తవులు పాల్గొన్నారు. అల్లూరు, జానకి గూడెం, కాకరవాడ, చేవూరు, కొరగుంటపాలెం, విశ్వనాద్రిపాలెం, పెయ్యేరు తదితర గ్రామాల్లో



పాస్టర్లు కటికల ప్రభుదాసు, గోళ్ల రాజ్‌కుమార్, ఉచ్చుల విజయ కుమార్ ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలు జరిగాయి.

మండవల్లి: మండవల్లి ఆర్సీఎం చర్చిలో రెవ ఫాదర్ నూతలపాటి కిషోర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సర్పంచ్ మెండా ఝాన్సీ, చర్చి పెద్దలు మెండా సురేష్‌బాబు, ఏసుదాసు, నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి రూరల్: మండలంలో సర్వమత ప్రార్థనలు జరిగాయి. చిగురుకోటలో నిర్వహించిన ప్రార్థనలో టీడీపీ నాయకుడు కొడాలి వినోద్ పాల్గొన్నారు.


ఆదివారం ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

హామీ ఏమైంది ఎమ్మెల్యే గారూ..!

రమణక్కపేట అరుంధతి కాలనీలో దాహం కేకలు..

11వ వార్డు సభ్యుడిగా టీడీపీ సానుభూతిపరుడు గెలిచాడనేనా?

రెండేళ్లుగా పట్టించుకోని సర్పంచ్

ఇటీవల ఎమ్మెల్యే ప్రచారాన్ని అడ్డుకున్న కాలనీ వాసులు

రెండ్రోజుల్లో పరిష్కరిస్తానని 4 రోజులైనా అతీగతీ లేదు

ఆదివారం ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ఎంపీడీవో కార్యాలయం ముట్టడికి నిర్ణయం

ముసునూరు, మార్చి 31 : తెలుగుదేశం పార్టీకి చెందిన వ్యక్తిని వార్డు సభ్యుడిగా గెలిపించుకోవడమే ముసునూరు మండలం రమణక్కపేట అరుంధతి కాలనీ వాసులకు శాపమైంది. ఫలితంగా గొంతు తడుపుకునేందుకు గుక్కెడు నీళ్ల కోసం రెండేళ్లుగా పొలాల్లో ఉన్న మోటార్ల వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. దీనిపై ఇటీవల ఎన్నికల ప్రచారానికి వచ్చిన నూజివీడు ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావును కాలనీవాసులు నిలదీశారు. 24 గంటల్లో మీ సమస్య పరిష్కరిస్తానని ఇచ్చిన హామీ నాలుగు రోజులైనా నెరవేరలేదు. ఫలితంగా రమణక్కపేట అరుంధతి కాలనీ మహిళలు ఖాళీ బిందెలతో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ప్రాంతం చూడం, కులం చూడం, మతం చూడం, రాజకీయాలు అసలే చూడమంటూ ఓ పక్క జగన్ చెబుతుంటే స్థానిక వైసీపీ సానుభూతిపరుడైన సర్పంచ్ మాత్రం తమకు తాగునీరివ్వకుండా వివక్ష చూపుతున్నారని వాపోయారు. అధికారులు కాలనీకి తాగునీరు అందించేలా చర్యలు చేపట్టకపోతే ఎంపీడీవో కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు.

రెండేళ్ల నుంచి తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నా సర్పంచ్ మాత్రం వివక్ష చూపుతున్నారు. సంబంధిత అధికారులకు సమస్యపై వినతిపత్రాలు అందజేసినా నేటికీ పట్టించుకున్న వారు లేరు. ఎమ్మెల్యేకి పలుమార్లు నీటి సమస్యపై తెలిపినా సమస్య పరిష్కరిస్తానని చెప్పి ఏడాదైనా సమస్య అలాగే ఉంది. ఇటీవల కాలనీలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యేను నిలదీయగా, రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తానని చెప్పి హామీ ఇచ్చి నాలుగురోజులు పూర్తవుతున్నా చర్యలు లేవని 11వ వార్డు సభ్యుడు నందిపాం సత్యరాజు వాపోయాడు.

నరకం చూస్తున్నాం..

రమణక్కపేట అరుంధతినగర్‌లో తాగునీరు లేక రెండేళ్ల నుంచి నరకం చూస్తున్నాం. నీటికోసం చుట్టుపక్కల ఉన్న పంటపొలాల్లో మోటార్ల వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి. పంచాయతీ పాలకులు, అధికారులు అరుంధతీ నగర్‌పై వివక్ష చూపుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు అరుంధతినగర్‌లో నీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పార్టీలు అచ్చిరాలేదు : ముద్దరబోయిన

నూజివీడు, మార్చి 31: రాజకీయ పార్టీలు తనకు అచ్చి రాలేదని, స్వతంత్ర అభ్యర్థిగానే తనను కార్యకర్తలు గెలిపించారని మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. నూజివీడు మండలం పెదరావిచర్లలో ముద్దరబోయిన అభిమానుల ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గన్నవరంలోని తాను స్వతంత్ర అభ్యర్థిగానే గెలిచానని, గెలిచిన అనంతరం గన్నవరం అభివృద్ధికి తాను పార్టీలకు అతీతంగా కృషిచేశానన్నారు. ఈసారి తాను నాయకులను నమ్ముకోవడం లేదని, కార్యకర్తల అండతో నూజివీడు నియోజకవర్గంలో 25 వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తాననే నమ్మకం ఉందన్నారు.

ఘనంగా గంగానమ్మ జాతర



కలిదిండి, మార్చి 31: మండలంలోని సానారుద్రవరంలో ఆదివారం గంగానమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని మేళతాళాలతో ఊరేగించారు. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వర రావు, సర్పంచ్ నున్న రాజేశ్వరమ్మ, మాజీ సర్పంచ్ భగవాన్లు, సొసైటీ చైర్మన్ వడ్లాని పార్థసారథి, డిసి మాజీ చైర్మన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వివాహిత అనుమానాస్పద మృతి


మృతి చెందిన మద్దుల రాధ

మండవల్లి, మార్చి 31: గృహిణి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. మండవల్లి పోలీసుల వివరాల ప్రకారం మండవల్లి గ్రామానికి చెందిన మద్దుల రాధ (30) ఆమె భర్త సాయికృష్ణ మధ్య ఈ నెల 26న చీటీ డబ్బుల విషయమై వివాదం జరిగింది. భర్త అసభ్య పదజాలంతో దూషించడంతో రాధ కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకొని తాగింది. స్థానికులు గుర్తించి మచిలీపట్నం తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. వీరికి ఇద్దరు పిల్లలు. సాయికృష్ణ వ్యసనాలకు బానిసై నిత్యం భార్యను వేధిస్తుండడంతో ఆమె పురుగుల మందు తాగిందని మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు మండవల్లి ఎస్సై రామచంద్రరావు కేసు నమోదు చేశారు.


పార్థసారథికి సంఘీభావం తెలుపుతున్న జనసేన నాయకులు


అల్లూరులో టీడీపీ నాయకులు ప్రచారం

అసెంబ్లీలో సమస్యల్ని ప్రస్తావించని ఎమ్మెల్యే

» నూజివీడు కూటమి అభ్యర్థి పార్థసారథి ధ్వజం

నూజివీడు, మార్చి 31: అసెంబ్లీలో ఏ ఒక్క సమస్యపైనైనా స్థానిక ఎమ్మెల్యే ప్రస్తావించి ఉంటే నూజివీడులో సమస్యలు ఎప్పుడో పరిష్కారమయ్యేవని నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడులో ఆదివారం 10, 11, 12 వార్డుల్లో మన ఇంటికి మన సారథి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుమారుడికి కాంట్రాక్ట్‌ల కోసం సీఎం చుట్టూ ప్రదక్షిణలు చేయడంపై ఉన్న శ్రద్ధ సమస్యల పరిష్కారంపై లేదన్నారు. నూజివీడు మొగల్‌చెరువు పరిసర ప్రాంతాల్లో అనేకమంది పేదలు ఇళ్ళు కట్టుకుని ఉన్నారని, వాళ్ళకు పొజిషన్ సర్టిఫికెట్ లేదా పట్టాలను ఇప్పించే అవకాశం ఉండి, మాట్లాడటం చేతకాక నేటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత మొగల్‌చెరువులో ఇళ్ళు కట్టుకున్న వారికి పట్టాలు ఇచ్చేందుకు చర్యలు చేపడతానన్నారు. ఇక్కడి ఎమ్మెల్యే కుమారుడికి ఎమ్మార్వోలు, పోలీసులను ఎలా ఉపయోగించుకోవాలో ఆయనకు తెలిసినంతగా మరెవ్వరికి తెలియదన్నారు. కంప్యూటర్‌లో రికార్డులు రాత్రికి రాత్రి మారిపోతాయనే విషయం తెలుసుకుని ఆశ్చర్యపోయామన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక రహదారుల విస్తరణతో పాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజి వ్యవస్థ ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, కౌన్సిలర్ తిరుమలశెట్టి లక్ష్మిసాధనా స్రవంతి, మాజీ కౌన్సిలర్లు వెంకట కృష్ణారావు, అన్నే నాని, టీడీపీ నూజివీడు పట్టణ అధ్యక్షుడు మల్లిశెట్టి జగదీష్, టీడీపీ శ్రేణులు పాల్గొన్నాయి.

కూటమి గెలుపునకు జనసైనికులు కృషి చేయాలి

నూజివీడు టౌన్: నూజివీడు నియోజకవర్గంలో కూటమి జెండా ఎగురవేసేందుకు జన సైనికులు సైనికుల్లా కృషి చేయాలని నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు. నూజివీడులో జనసేన నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాన్ని జనసేన ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. శివరామకృష్ణ మాట్లాడుతూ నూజివీడు పట్టణంలో టిడ్కో లబ్ధిదారులకు ఇళ్ల ఇవ్వాలని, మల్లవల్లి ఇండస్ట్రీయల్ కారిడార్ నిర్వాసిత రైతుల పక్షాన, చింతలపూడి ఎత్తిపోతల పథకం కోసం తదితర సమస్యల పరిష్కారానికి జనసేన అవిశ్రాంత పోరాటం చేసిందన్నారు. నూజివీడు మండల జనసేన అధ్యక్షుడు యర్రంశెట్టి రాము, జనసేన నాయకులు ముత్యాల కామేష్, ఎం.సునిల్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి

ముసునూరు, మార్చి 31: టీడీపీతోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, పార్టీ గ్రామ అధ్యక్షుడు వేంపాటి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం లోపూడిలో సూపర్ సిక్స్ పథకాల పై ఇంటింటి ప్రచారం నిర్వహించి, కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఐదేళ్ళ వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పులపాలవడంతో పాటు అభివృద్ధి కుంటుపడిందన్నారు. నూజివీడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథికి ఓటువేసి గెలిపించుకుంటే గ్రామీణ ప్రాంతాలు సైతం అభివృద్ధి చెందుతాయని వివరించారు. టీడీపీ నాయకులు చలమాల వెంకటేశ్వరరావు, నక్కా చెన్నారావు, డోలా రాంబాబు, కాటేపల్లి కేశవరావు, పేరం వెంకటరమణ, పంజుగుల వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఆదివారం ముదినేపల్లి మండలం అల్లూరు గ్రామంలో టీడీపీ నాయకులు ప్రచారం చేశారు. తెలుగు యువత కైకలూరు నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఏలూరు లోక్‌సభ టీడీపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ల తరఫున ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మేనిఫెస్టో పత్రాలను ఓటర్లకు అందజేశారు. మహిళలకు వివిధ పథకాల ద్వారా అందజేయనున్న లబ్ధిని వివరించారు. పెన్షన్‌ను రూ.4 వేలకు మించి ఇంటింటికీ పంపిస్తామన్న చంద్రబాబు వాగ్దానం అమలు జరిగి తీరుతుందని నాగరాజు తెలిపారు. పార్టీ నాయకులు నీలిపల్లి సన్యాసిరావు, ముంద్రు బాలరాజు, దాసరి శ్రీను, పత్తి శివ, సింగరాతి సత్యనారాయణ, బొమ్మనబోయిన వెంకట రత్నం, బర్ల రామమోహనరావు తదిరతులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు కాపా ఆర్థిక సాయం



ఆగిరిపల్లి, మార్చి 31: ఇటీవల జరిగిన ఆటో ప్రమాదంలో మరణించిన ఇద్దరు మహిళా కూలీల కుటుంబాలను నూజివీడు ఏఎంసీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్నాలగొల్లగూడెం గ్రామంలో ప్రతి రైతు విత్తన పత్తి పండిస్తారని, డిసెంబరులో తుఫాను కారణంగా ఆయా కుటుంబాలు నష్టపోయి ఆడవారు వ్యవసాయ కూలీలుగా వెళుతున్నారని వాపోయారు. మృతిచెందిన వీర్ల సుజాత, వీర్ల కృష్ణకుమారి కుటుంబాలకు రూ. లక్ష చొప్పున అందజేశారు. రైతులు నడ్డివిరుస్తున్న ప్రభుత్వం తప్పక మారాలని కాపా కోరారు. తాను చేసేది సాయం కాదని, తోటి రైతుగా తన బాధ్యత అన్నారు.



పేద విద్యార్థులకు మానవత చేయూత

కైకలూరు, మార్చి 31: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పేద విద్యార్థులకు చేయూతనిచ్చింది. ఆదివారం కైకలూరులో ఒకరికి సైకిల్, మరొకరికి కుట్టుమిషన్, మరో ఇద్దరు విద్యార్థినులకు ఆర్థిక సాయం అందజేశారు. ట్రస్ట్ సభ్యులు ఎం. పద్మజ, పి. రత్నాకరరావు, గుర్రం శ్యాంకుమార్, రుద్రపాక రత్నాకరరావు, కొణిజేటి వెంకటేశ్వరరావు, జీవీఎస్ రామాంజనేయులు, గొల్లు సోమేశ్వరరావు, సమయమంతుల గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బాస్కెట్‌బాల్ పోటీలు

నూజివీడు, మార్చి 31: బొబ్బిలి కొండలరావు మెమోరియల్ ఇన్విటేషనల్ జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఆదివారం మొత్తం రెండు మ్యాచ్‌లు నిర్వహించగా, మొదటి మ్యాచ్‌లో ఇండియన్ ఆర్మీ, జైన్ వర్సిటీ బెంగుళూరు పాల్గొన్నాయి. జైన్ వర్సిటీపై 83-88 స్కోరుతో ఇండియన్ ఆర్మీ విజయం సాధించింది. ఇక రెండో మ్యాచ్ కేరళ ఎలక్ట్రిసిటీ బోర్డు, ఇండియన్ ఆర్మీ తలపడగా, 81-65 స్కోరుతో కేరళ ఎలక్ట్రిసిటీ బోర్డు విజయం సాధించింది.

నవోదయకు సీతారాంపురం బాలికల ఎంపిక

ఆగిరిపల్లి, మార్చి 31: మండలంలోని సీతారాంపురం ఎంపీ యూపీ పాఠశాల నుంచి ఇద్దరు బాలికలు నవోదయకు ఎంపికైనట్లు సర్పంచ్, ఆంధ్రప్రదేశ్ పెరిక కార్పొరేషన్ డైరెక్టర్ ఆత్తి పార్వతి తెలిపారు. ఎంపికైన చిత్తులూరి దీక్షిత, తనుషా శ్రీ, సిబ్బందిని ఆమె అభినందించారు.

చింతలపూడి పూర్తి చేసేవారికే ఓటు వేయాలి

చాట్రాయి, మార్చి 31: చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి సాగు నీరు ఇస్తామని హామీ ఇచ్చిన పార్టీకే ప్రజలు ఓట్లు వెయ్యాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి. హరనాథ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ 5 ఏళ్ల పాలనలో చింతలపూడితో పాటు అన్ని సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడంతో పంటలు పండక అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకు పోయారన్నారు. సీఎం జగన్ కేవలం 2 వేల కోట్లు ఖర్చు చేసి చింతలపూడి పూర్తి చేసి ఉంటే 5 లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందేవన్నారు. పిట్టలవారిగూడెం ఎత్తిపోతల పథకానికి టీడీపీ హయాంలో నిధులు మంజూరైనా పనులు ప్రారంభించలేదని, జగన్ ప్రభుత్వానికి రైతు సంక్షేమం పట్ల చిత్తశుద్ధి లేదన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు

నూజివీడు టౌన్, మార్చి 31: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ తు.చ. తప్పకుండా పాటించాలని నూజివీడు రూరల్ సీఐ కె.రామకృష్ణ అన్నారు. తుక్కులూరులో ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 50 వేలకు మించి నగదు తరలిస్తే నగదును సీజ్ చేస్తామని హెచ్చరించారు. అధిక మొత్తంలో నగదు తీసుకు వెళ్ళాల్సి వస్తే అందుకు సంబంధించిన తగిన పత్రాలను కలిగి ఉండాలన్నారు.

నేడు కూటమి సమావేశం

కలిదిండి, మార్చి 31 : కలిదిండిలో సోమవారం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి పార్టీల సమావేశం నిర్వహిస్తున్నామని టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు తెలిపారు. అనంతరం పేట కలిదిండిలో కూటమి అభ్యర్థి కామనేని శ్రీనివాస్ ఆత్మీయ సమావేశం నిర్వహిస్తారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని ఆయన కోరారు.

నేడు చాట్రాయి మండలంలో పార్థసారథి పర్యటన

చాట్రాయి, మార్చి 31: నూజివీడు అసెంబ్లీ కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి సోమవారం మండలంలో పర్యటిస్తారని టీడీపీ నాయకులు తెలిపారు. ఆరుగొలనుపేట, చాట్రాయి, చిన్నంపేట, చీపురుగూడెం, తుమ్మగూడెం గ్రామాలలో పర్యటిస్తారని అన్ని గ్రామాల కూటమి శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

లోకేశ్ ఆదేశాలు పాటిస్తా: కొడాలి వినోద్

ముదినేపల్లి రూరల్, మార్చి 31: యువనేత నారా లోకేశ్ ఆదేశాల మేరకు నడుచుకుంటానని టీడీపీ నాయకుడు కొడాలి వినోద్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే సీటును బీజేపీకి కేటాయించినప్పటికి పార్టీ ఆదేశానుసారం గెలుపుకోసం పనిచేస్తానని పేర్కొన్నారు. కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా తక్షణం స్పందించి ఆదుకుంటానన్నారు.


ఆర్‌ఎంపీ వైద్యుల సమావేశంలో మాట్లాడుతున్న కామినేని

ప్రాథమిక వైద్యంపై అవగాహన అవశ్యం

ముదినేపల్లి, మార్చి 31 : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండే ఆర్‌ఎంపీలు ప్రాథమిక వైద్యంపై అవగాహన పెంచుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ మాజీ మంత్రి, కైకలూరు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ముదినేపల్లిలో ఆదివారం గుడివాడ ఈవీఆర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో న్యూరాలజీ వైద్యంపై కైకలూరు నియోజకవర్గంలోని ఆర్‌ఎంపీ వైద్యులకు అవగాహన కార్యక్రమాన్ని ఆస్పత్రి న్యూరో సర్జన్ డాక్టర్ ఈడ్పుగంటి రాజ్యలక్ష్మి నిర్వహించారు. ఆర్‌ఎంపీల సమస్యల పరిష్కారం, వారి గుర్తింపునకు సంబంధించిన అంశాల అమలుకు తనవంతు సహకారం అందిస్తానని కామినేని హామీ ఇచ్చారు. ప్రముఖ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ సీఎల్ వెంకట్రావు, హస్పటల్ సీఈఓ డాక్టర్ ఈడ్పుగంటి శ్రీనివాస్, ఆర్‌ఎంపీల యూనియన్ నాయకుడు ఉమాశంకర్ పాల్గొన్నారు.

మహేష్‌ను కలసిన మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి



కైకలూరు, మార్చి 31: ఏలూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ ఏర్పాటు చేసిన సమావేశానికి కైకలూరు టీడీపీ నేతలు తరలివెళ్లారు. ఆదివారం ఏలూరు టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పుట్టా మహేష్‌ను కలసి కైకలూరు నియోజకవర్గ పరిస్థితులను మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు వివరించారు. రాష్ట్ర కార్యదర్శి కొత్త నాగేంద్రబాబు, పార్టీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, టీడీపీ నాయకుడు బీకేఎం నాని, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పూల రామచంద్రరావు, మన్నె శ్రీను, దాసరి ఆంజనేయులు, మన్నె చిన్నబాబు, గద్దె రఘు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు



కైకలూరు, మార్చి 31: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్ అన్నారు. ఆదివారం కైకలూరు మండలం పల్లెవాడ, శృంగవరప్పాడు, పందిరిపల్లిగూడెం, ఆలపాడు గ్రామాలలో సీఆర్పీఎఫ్ బలగాలతో కలసి పోలీసులు కవాతు నిర్వహించారు. అనంతరం వదర్లపాడు బ్రాంచి వద్ద జాతీయ రహదారిపై వాహన తనిఖీలు నిర్వహించారు. కార్లు, బైక్‌లపై వెళ్లేవారిని తనిఖీ చేశారు. రూరల్ ఎస్సై టి. రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.